# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 | సంచిక : 265 | మంగళవారం 16 ఏప్రిల్ 2024 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# కమలంలో కుమ్ములాట!

నేతల మధ్య జరగుతున్న పోరుతో కొత్త సీట్ల సంగతి అలా పెడితే, ఉన్న సీట్లు కూడా గెలుచుకోవటం కష్టమేనని ఆ పార్టీ నేతలు భయపడుతున్నారు. అగ్రనాయకులంతా వర్గాలుగా విడిపోయి, ఈ లోక్‌సభ ఎన్నికల్లో తమ ప్రత్యర్థులను ఓడించే పనిలో పడటంతో ఎన్నడూ లేని ఈ మితిమీరిన వర్గపోరు ఎటు దారి తీస్తుందో అని పార్టీ అధిష్టానం బెంబేలెత్తుతోంది.

- నేతల మధ్య జరగుతున్న పోరుతో కొత్త సీట్ల సంగతి అలా పెడితే, ఉన్న సీట్లు కూడా గెలుచుకోవటం కష్టమే
- మితిమీరిన వర్గపోరు ఎటు దారి తీస్తుందో అని పార్టీ అధిష్ఠానం బెంబేలెత్తుతోంది.
- అమిత్ షా హెచ్చరికలనూ లెక్కచేయకుండా కొందరు నేతలు రచిస్తున్న వ్యూహాలు.. మొదటికే మోసం తేనున్నాయనే వార్తలూ
- బీజేపీలో చేరిన నేతలకు అధిష్ఠానం అధిక ప్రాధాన్యం ఇవ్వటం పాతతరం నేతలకు కంటగింపుగా మారుతోంది.



హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల వేళ తెలంగాణ ఎంపీ అభ్యర్థులు, నేతల వైఖరితో బీజేపీ హైకమాండ్ తలలు పట్టుకుంటోంది. నేతల మధ్య జరగుతున్న పోరుతో కొత్త సీట్ల సంగతి అలా పెడితే, ఉన్న సీట్లు కూడా గెలుచుకోవటం కష్టమేనని ఆ పార్టీ నేతలు భయపడుతున్నారు. అగ్రనాయకులంతా వర్గాలుగా విడిపోయి, ఈ లోక్‌సభ ఎన్నికల్లో తమ ప్రత్యర్థులను ఓడించే పనిలో పడటంతో ఎన్నడూ లేని ఈ మితిమీరిన వర్గపోరు ఎటు దారి తీస్తుందో అని పార్టీ అధిష్ఠానం బెంబేలెత్తుతోంది. అమిత్ షా హెచ్చరికలనూ లెక్కచేయకుండా కొందరు నేతలు రచిస్తున్న వ్యూహాలు.. మొదటికే మోసం తేనున్నాయనే వార్తలూ వినిపిస్తున్నాయి. తెలంగాణ బీజేపీ నాయకులంతా ఇప్పుడు కొత్త, పాత నాయకులనే రెండు తరగతులుగా -మిగతా3లో



## తెలంగాణకు వర్ష సూచన

- వచ్చే పది రోజుల పాటు ఎండ తీవ్రత తగ్గి.. పలు చోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం
- వర్షాల కారణంగా తగ మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు కాస్త పడిపోయాయి.
- వాతావరణ కేంద్రం వెల్లడి
- ఈ నెల 25 వరకు రాష్ట్రంలో తీవ్రమైన ఎండలు, వడగాడ్పులు ఉండవని, సాధారణ ఉష్ణోగ్రతలు మాత్రమే
- నైరుతి రుతుపవనాలు తుఫానుగా మారి కోస్తా కర్ణాటక వరకు వ్యాప్తి
- గురు, శుక్ర, శని, ఆదివారాల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు

హైదరాబాద్

తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ చల్లని వార్త అందించింది. వచ్చే పది రోజుల పాటు ఎండ తీవ్రత తగ్గి.. పలు చోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. తర్వాత ఎండ తీవ్రత పెరిగే సూచనలు ఉన్నట్టు స్పష్టం చేసింది. కాగా, వర్షాల కారణంగా తగ మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు కాస్త పడిపోయాయి. వచ్చే పది రోజులపాటు అంటే.. ఈ నెల 25 వరకు రాష్ట్రంలో తీవ్రమైన ఎండలు, వడగాడ్పులు ఉండవని, సాధారణ ఉష్ణోగ్రతలు మాత్రమే నమోదవుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాష్ట్రంలో ఈ నెల 18 నుంచి 25 వరకు ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణశాఖ అంచనా వేసింది. రాజస్థాన్ మీదుగా నైరుతి రుతుపవనాలు తుఫానుగా మారి కోస్తా కర్ణాటక వరకు వ్యాపించాయని తెలిపింది. మరో ఐదురోజులపాటు హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు సాధారణం -మిగతా3లో

## మరో 2 వారాలు జైల్లోనే




- సుప్రీంకోర్టులో కేజ్రీవాల్‌కు దక్కని ఊరట
- విచారణ జరిపిన జస్టిస్ సంజీవ్ ఖన్నా, దీపంకర్ దత్త ధర్మాసనం..
- కేజ్రీవాల్ పిటిషన్‌పై ఈడీకి నోటిసులు జారీ
- ఏప్రిల్ 24 వరకు సమాధానం ఇవ్వాలని ఈడీని సుప్రీంకోర్టు ఆదేశం
- ఈడీ సమాధానంపై ఏప్రిల్ 27 వరకు రిజాయిన్డెర్ దాఖలు చేయాలని కేజ్రీవాల్‌కు తరఫు న్యాయవాదిని ఆదేశం
- తదుపరి విచారణ ఏప్రిల్ 29కి వాయిదా

## ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలక పరిణామం

- ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టైన నలుగురు పోలీస్ అధికారులు బెయిల్ పిటిషన్‌ను విత్ డ్రా
- 10 ఏళ్ల కంటే ఎక్కువ శిక్షపడే సెక్షన్ కావడంతో సెషన్ కోర్టుకు వెళ్లాలన్న నాంపల్లి కోర్టు సూచన
- ఈ కేసు దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన అంశాల ఆధారంగా కొందరు ప్రజాప్రతినిధులు నోటీసులు ఇచ్చే అవకాశం
- సాధారణ ఎన్నికల సమయంలో ఈ నగదు అక్రమ రవాణా ఎక్కువగా జరిగినట్లు తేల్చిన వైనం

హైదరాబాద్

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టైన నలుగురు పోలీస్ అధికారులు బెయిల్ పిటిషన్‌ను విత్ డ్రా చేసుకున్నారు. నలుగురు నిందితులపై పోలీసులు సెక్షన్ 70 ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేయగా.. 10 ఏళ్ల కంటే ఎక్కువ శిక్షపడే సెక్షన్ కావడంతో సెషన్ కోర్టుకు వెళ్లాలన్న నాంపల్లి కోర్టు సూచించింది. దీంతో నాంపల్లి ఏసీఎంఎం కోర్టులో వేసిన బెయిల్ పిటిషన్‌ను విత్‌డ్రా చేసుకున్నారు. మంగళవారం నాంపల్లి సెషన్ కోర్టులో కొత్తగా బెయిల్ పిటిషన్ దాఖలు చేయనున్నారు నిందితులు. కాగా గత ఎన్నికల సందర్భంగా పోలీసు వాహనాల్లో నగదును అక్రమంగా తరలించిన విషయం ఫోన్ ట్యాపింగ్ -మిగతా3లో




## కవితకు వార్నింగ్




- కోర్టు ఆవరణలో మీడియాతో మాట్లాడటంపై జడ్జి సీరియస్
- జర్నలిస్టులు ప్రశ్నలు అడిగినా ఎలా మాట్లాడతారు అంటూ ఆగ్రహం
- ఇంకోసారి ఇలా మాట్లాడవద్దు అంటూ వార్నింగ్
- ఈనెల 23 వరకు ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు
- సాక్ష్యాలను కవిత ముందు పెట్టి విచారించాం
- ఆమె విచారణకు సహకరించలేదని సీబీఐ వెల్లడి

ఢిల్లీ/హైదరాబాద్

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మరోసారి చుక్కెదురైంది. లిక్కర్ స్కాం కేసులో కవితకు ఈనెల 23వ తేదీ వరకు జ్యుడీషియల్ కస్టడీని విధించింది రౌస్ ఎవెన్యూ కోర్టు. దీంతో సీబీఐ అధికారులు ఆమెను తీహార్ జైలుకు తరలించారు. మూడు రోజుల కస్టడీ ముగియడంతో ఈరోజు ఉదయం కవితను సీబీఐ అధికారులు ప్రత్యేక కోర్టులో సీబీఐ న్యాయమూర్తి కావేరి బవేజా ముందు ప్రవేశ పెట్టారు. ఆ సమయంలో సీబీఐ తన వాదనలు వినిపిస్తూ.. సాక్ష్యాలను కవిత ముందు పెట్టి విచారించాం. ఆమె విచారణకు సహకరించలేదని వెల్లడించింది. ఈ క్రమంలో కవితను విచారించేందుకు మరింత సమయం కావాలని కోరింది. అందుకోసం మరో 14 రోజులు కస్టడీ పొడిగించాలని సీబీఐ కోరగా.. కోర్టు మాత్రం 9 రోజుల కస్టడీకి అనుమతించింది. ఈ నేపథ్యంలో ఈనెల 23వ తేదీ వరకు కవితకు కోర్టు కస్టడీని పొడిగించింది. ఇదే సమయంలో కవితపై ప్రత్యేక కోర్టు జడ్జి కావేరీ బవేజా ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టు ఆవరణలో మీడియాతో మాట్లాడటంపై సీరియస్ అయ్యారు. జర్నలిస్టులు ప్రశ్నలు అడిగినా ఎలా మాట్లాడతారు అంటూ ఆగ్రహం వ్యక్తపరిచారు. ఇంకోసారి ఇలా -మిగతా3లో



## కాంగ్రెస్ మోడల్‌కు కాలం చెల్లింది

- లోక్‌సభ ఎన్నికల్లో పాలనలో సామర్థ్యం కనబరిచిన బీజేపీ మోడల్, విఫలమైన కాంగ్రెస్ మోడల్‌లో ఏది ఎంచుకుంటారనేది ప్రజలు నిర్ణయించుకోవాలి
- 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మలిచేందుకు స్పష్టమైన విజన్‌తో పనిచేస్తున్నాం
- తనకు భారీ ప్రణాళికలు ఉన్నాయని చెబితే ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు
- ఎవరినీ భయపెట్టే నిర్ణయాలు తాను తీసుకోనని స్పష్టం
- 2047 వికసిత్ భారత్ ప్రాజెక్ట్ పనులు రెండేండ్లుగా సాగుతున్నాయి
- ఎలక్టోరల్ బాండ్స్ స్కీమ్‌పై ప్రతిపక్షాలు అసత్యాలు ప్రచారం చేస్తున్నాయి
- ఎన్నికల్లో నల్లధనాన్ని అరికట్టేందుకు ఈ పథకాన్ని తాము తీసుకువచ్చాం
- ఏఎన్ఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రధాని నరేంద్ర మోదీ


## మణిపుర్ ఎన్నటికీ భారత్‌లో అంతర్భాగమే..



- మణిపుర్ జనాభాను మార్చే ప్రయత్నాలు జరిగాయి
- మణిపుర్ ను విచ్ఛిన్నం చేసే శక్తులు, ఐక్యం చేసే శక్తుల మధ్య లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయి
- రాష్ట్రంలో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా సంచలన ప్రకటన

# కాంగ్రెస్ మోడల్‌కు కాలం చెల్లింది

**న్యూఢిల్లీ:** రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పాలనలో సామర్థ్యం కనబరిచిన బీజేపీ మోడల్, విఫలమైన కాంగ్రెస్ మోడల్‌లో ఏది ఎంచుకుంటారనేది ప్రజలు నిర్ణయించుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మలిచేందుకు స్పష్టమైన విజన్‌తో పనిచేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. మోదీ సర్కార్ మూడోసారి అధికారంలోకి వస్తే బీజేపీ దేశ రాజ్యాంగాన్ని మార్చేస్తుందని విపక్షాలు ప్రజల్లో భయాందోళనలు రేకెత్తిస్తున్నాయని ఏఎన్ఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు. తనకు భారీ ప్రణాళికలు ఉన్నాయని చెబితే ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, ఎవరినీ భయపెట్టే నిర్ణయాలు తాను తీసుకోనని స్పష్టం చేశారు. దేశ అభివృద్ధికి బాటలువేసే నిర్ణయాలనే తాను తీసుకుంటానని చెప్పారు. ప్రతి పనినీ సరైన దిశలో తీసుకోవాలని తాను ప్రయత్నిస్తానని అన్నారు. తాను ఇంకా చేయాల్సింది ఎంతోఉందని, దేశ అవసరాలు ఎన్నో ఉన్నాయనే విషయం తనకు తెలుసునని చెప్పారు. ప్రతి కుటుంబం కలలు ఎలా నెరవేర్చాలనేదే తన ఆకాంక్ష అని, అందుకే ఇది అభివృద్ధికి ట్రైలర్ మాత్రమేనని అన్నానని గుర్తుచేశారు. 2047 వికసిత్ భారత్ ప్రాజెక్ట్ పనులు రెండేండ్లుగా సాగుతున్నాయని, తాను తిరిగి ప్రధానిగా అధికార పగ్గాలు చేపడితే తొలి 100 రోజుల్లో చేయాల్సిన కార్యక్రమాలపై లక్ష్యాన్ని నిర్ధేశించుకున్నానని చెప్పారు.




రాబోయే 25 ఏండ్లలో భారత్‌ను ఎలా చూడాలనుకుంటున్నారని తాను 15 లక్షల మందికి పైగా వివిధ వర్గాల ప్రజల నుంచి సలహాలు స్వీకరించానని వివరించారు. ఆపై తాను ఏఐ సాయంతో అంశాల వారీగా వాటిని వర్గీకరించానని ప్రధాని తెలిపారు. దీనిపై పనిచేసేందుకు ప్రతి విభాగంలో అధికారులతో కూడిన బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు.

**ఎలక్టోరల్ బాండ్లపై ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు**

లోక్‌సభ ఎన్నికలకు ముందు రాజకీయంగా ప్రకంపనలు సృష్టించిన 'ఎలక్టోరల్ బాండ్స్ స్కీమ్' పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమాధానమిచ్చారు. ఎలక్టోరల్ బాండ్స్ స్కీమ్‌పై ప్రతిపక్షాలు అసత్యాలు ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల్లో నల్లధనాన్ని అరికట్టేందుకు ఈ పథకాన్ని తాము తీసుకువచ్చామని, నిజాయితీగా అంగీకరించినప్పుడు వాళ్లు పశ్చాత్తాప పడతారని అన్నారు. ఎలక్టోరల్ బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ ఈ పథకాన్ని గత ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు కొట్టివేసింది. "నిర్ణయాలు తీసుకోవడంలో లోటుపాట్లు ఉండవని నేను ఎప్పుడూ చెప్పలేదు. లోటుపాట్లు ఉంటే వాటిపై చర్చించి మెరుగుపరుచుకుంటాం. ఈ విషయంలోనూఎలక్టోరల్ బాండ్ల పథకం) మెరుగుపరచుకునేందుకు ఎంతో అవకాశం ఉంది. ఈరోజు దేశాన్ని నల్లధనం వైపు మనం నెట్టేశాం. ఇది పశ్చాత్తాపపడాల్సిన విషయం. నిజాయితీ వాళ్లు ఆలోచించినప్పుడు ప్రతి ఒక్కరూ పశ్చాత్తాప పడతారు" అని మోదీ ఈ ఇంటర్వ్యూలో తన అభిప్రాయాన్ని స్పష్టంచేశారు.

ఎలక్టోరల్ బాండ్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన సంచలన తీర్పును విపక్ష పార్టీలు, పౌర సమాజం కార్యకర్తలు స్వాగతించారు. ఈ పథకం కింద అత్యధికంగా నిధులు అందుకున్న పార్టీలో బీజేపీ మొదటి స్థానంలో ఉందని విశ్లేషణలు వెలువడ్డాయి. ఈ స్కీమ్ ద్వారా బీజేపీ అవినీతికి పాల్పడి అత్యధిక విరాళాలు అందుకుందని విపక్ష 'ఇండియా' కూటమి ఆరోపించగా, కేంద్రం పారదర్శకంగానే స్కీమ్ ప్రవేశపెట్టిందని, తమ కంటే విపక్ష కూటమికి వచ్చిన విరాళాలే ఎక్కువని బీజేపీ స్పష్టం చేసింది.

# ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ కూటముల పాలనలో కేరళ పరిస్థితి దిగజారిపోయింది

**తిరువనంతపురం:** ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ కూటముల పాలనలో కేరళ పరిస్థితి దిగజారిపోయిందని ప్రధాని మోదీ ఆరోపించారు. కేరళలోని పాలక్కాడ్‌లో సోమవారం(ఏప్రిల్ 15) జరిగిన లోక్‌సభ ఎన్నికల ప్రచార సభలో మోదీ మాట్లాడారు. పశ్చిమ బెంగాల్ నుంచి కేరళ దాకా లెఫ్ట్ ప్రభుత్వాలు ఎక్కడున్నా ఒకేలా వ్యవహరిస్తాయని ఎద్దేవా చేశారు. 'కాంగ్రెస్ పార్టీ యువరాజు ఇక్కడికి వచ్చి మిమ్మల్ని ఓట్లడుగుతాడు. కానీ కేరళ పజలకు ఉన్న ఒక్క సమస్యపైనా మాట్లాడడు' అని రాహుల్‌గాంధీని ఉద్దేశించి ప్రధాని చురకంటించారు. మరోపక్క బీజేపీ తాజాగా విడుదల చేసిన మేనిఫెస్టోపై సోమవారం తమిళనాడులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాహుల్‌గాంధీ విమర్శలు గుప్పించారు.

ఉత్తర ప్రదేశ్‌లోని తమ కుటుంబ లోక్ సభ నియోజకవర్గాన్ని వదిలి కేరళలో కొత్త స్థావరాన్ని ఏర్పరుచుకున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ప్రధాని నరేంద్ర మోదీ పరోక్షంగా విమర్శలు గుప్పించారు. సోమవారం ఆయన పలక్కాడ్‌లో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ... 'కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ పెద్ద నాయకుడు ఉత్తర ప్రదేశ్‌లో తనకు కుటుంబం ప్రాతినిథ్యం వహించిన సీటును వదిలేశాడు. కేరళలో కొత్త స్థావరాన్ని ఏర్పరుచుకున్నాడు' అని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ 2019 వరకు పలుమార్లు అమేథీ నుంచి గెలుపొందారు. 2019లో బీజేపీ నుంచి పోటీ చేసిన స్మృతి ఇరానీ ఆయనను ఓడించి రికార్డ్ సృష్టించారు.




2019లో అమేథితో పాటు వయనాడ్ నుంచి పోటీ చేసిన రాహుల్ గాంధీ ఈసారీ అక్కడి నుంచి బరిలోకి దిగుతున్నారు. ఈ నేపథ్యంలో మోదీ పరోక్షంగా విమర్శలు గుప్పించారు. రాహుల్ గాంధీ 2004 నుంచి 2019 వరకు నాలుగుసార్లు అమేథి నుంచి పోటీ చేసి మూడుసార్లు గెలిచారు. అయితే ఈసారి కూడా అమేథి నుంచి పోటీ చేయాలని స్థానిక కాంగ్రెస్ నాయకులు కోరుతున్నారు. దీనిపై అధిష్ఠానం, రాహుల్ గాంధీ ఇప్పటి వరకు ఏమీ మాట్లాడలేదు. మరోవైపు సోనియా గాంధీ రాజ్యసభకు వెళ్లడంతో రాయ్‌బరేలి నుంచి ఎవరు పోటీ చేస్తారనే చర్చ సాగుతోంది. కేరళలో నిషేధించబడిన పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా రాజకీయ విభాగమైన సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా సహాయాన్ని కాంగ్రెస్ తీసుకుంటోందని మోదీ ఆరోపించారు. ఎన్నికల్లో గెలవడానికి దేశవ్యతిరేక చర్యలకు పాల్పడిన సంస్థ రాజకీయ విభాగ సంస్థతో కాంగ్రెస్ బ్యాక్ డోర్ ఒప్పందం కుదుర్చుకుందని మండిపడ్డారు. కేరళలో సామాన్య ప్రజలను కష్టాలకు గురి చేసిన కరువన్నూర్ కోఆపరేటివ్ బ్యాంకు కుంభకోణంపై రాహుల్ గాంధీ పెదవి విప్పడం లేదని విమర్శించారు. ఈ సహకార బ్యాంకు కుంభకోణంలో ప్రజల సొమ్మును ఎలా దోచుకున్నారో కాంగ్రెస్ నేతలు ప్రజలకు చెప్పే ప్రయత్నం చేశారా? అని నిలదీశారు. కానీ ఓట్లు మాత్రం అడుగుతారా? అని మండిపడ్డారు. ప్రజల సమస్యలపై ఒక్క మాట మాట్లాడటం లేదన్నారు.

**కేరళ ముఖ్యమంత్రిపై విమర్శలు**

గత మూడేళ్లుగా కేరళ ముఖ్యమంత్రి విజయన్ అబద్దాలే మాట్లాడుతున్నారన్నారు. సహకార బ్యాంకు కుంభకోణంపై ప్రజల ముందు నిజాలు ఉంచడం లేదన్నారు. కానీ ఈడీ మాత్రం ఈ కేసుకు సంబంధించి రూ.90 కోట్లను అటాచ్ చేసిందన్నారు. కేరళ ప్రజల డబ్బులు ఎక్కడకూ పోవని... ఇది మోదీ గ్యారెంటీ అన్నారు. గత కొన్నేళ్లుగా బ్యాంకులను మోసం చేసిన వారి నుంచి రూ.17వేల కోట్లు వెనక్కి తెచ్చామన్నారు. కేరళలో తాగునీటి సమస్య ఉందని... రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించడంలో విఫలమైందన్నారు. అదే సమయంలో ఎన్డీయే ప్రభుత్వం మాత్రం నారాయణగురు ఐడియాలజీ ప్రకారం ముందుకు సాగుతోందన్నారు. ప్రజలు... పేదల సంక్షేమం కోసం పని చేస్తున్నామన్నారు.

# బాబ్రీ మసీదును ఎక్కడ నిర్మిస్తున్నారు? నిధుల సేకరణ ఎలా?

అయోధ్యలో మసీదు నిర్మాణానికి జోరుగా సన్నాహాలు జరుగుతున్నాయి. బాబ్రీ మసీదు స్థానంలో మహ్మద్ బిన్ అబ్దుల్లా మసీదును నిర్మించనున్నారు. ముస్లింల పవిత్ర గ్రంథమైన ఖురాన్‌లోని వాక్యాలను లిఖించిన ఇటుకలను మసీదు నిర్మాణం కోసం వినియోగించనున్నారు. అయోధ్యలోని బాబ్రీ మసీదు స్థానంలో నిర్మించబోయే ఈ మసీదుకు మహమ్మద్ బిన్ అబ్దుల్లా మసీదు అని పేరు పెట్టారు. అయోధ్యకు 25 కిలోమీటర్ల దూరంలోని ధన్నీపూర్ గ్రామంలో ఈ మసీదును నిర్మించనున్నారు. అయోధ్య భూ వివాదంపై 2019లో తీర్పు వెలువరించిన సుప్రీం కోర్టు.. ఐదు ఎకరాల స్థలంలో మసీదు నిర్మించాలని ఆదేశించింది. మసీదు నిర్మాణ బాధ్యతను ఉత్తరప్రదేశ్ సున్నీ సెంట్రల్ వక్ఫ్ బోర్డుకు అనుసంధానంగా ఉన్న ఇండో-ఇస్లామిక్ కల్చరల్ ఫౌండేషన్ చేపట్టింది. మీడియాకు ఇండో ఇస్లామిక్ కల్చరల్ ఫౌండేషన్ సీనియర్ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం అయోధ్యలో మసీదు నిర్మాణం రాబోయే మే నెలలో ప్రారంభం కానుంది. నిర్మాణం పూర్తికావడానికి నాలుగేళ్లు పట్టవచ్చని భావిస్తున్నారు. మసీదు నిర్మాణం కోసం క్రౌడ్ ఫండింగ్ వెబ్‌సైట్ ద్వారా నిధులను సేకరించనున్నారు. ఈ మసీదులో ఐదు మినార్లు ఉండనున్నాయి. అతిపెద్ద ఖురాన్‌ను కూడా ఇక్కడ ఏర్పాటు చేయనున్నారు. మసీదు కాంప్లెక్స్‌లో ఆసుపత్రి, మ్యూజియం, లైబ్రరీ, కమ్యూనిటీ కిచెన్, ఇండో-





ఇస్లామిక్ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. మసీదు పునాదికి ఉపయోగించే పవిత్ర ఇటుకను మసీదు అభివృద్ధి కమిటీ అధిపతి హాజీ అరాఫత్ షేక్ భారతదేశానికి తీసుకువచ్చారు. ఈ ఇటుకపై మహ్మద్ ప్రవక్త ప్రవచనాలను బంగారంతో లిఖించారు. మసీదులో మొదటి ప్రార్థనను మక్కా ఇమామ్ ఇమామ్-ఎ-హరమ్ అబ్దుల్ రెహమాన్ అల్-సుదైస్ చేస్తారని సమాచారం.

# కుటుంబ రాజకీయాలకు స్వస్తి చెప్పండి: యోగి ఆదిత్యనాథ్

**ఔరంగాబాద్:** దేశంలో సార్వత్రిక ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. జాతీయ పార్టీల కీలక నేతలు సైతం రంగంలోకి దిగి ప్రచారం మొదలు పెట్టేసారు. ఇందులో భాగంగానే బీహార్‌లోని ఔరంగాబాద్‌లో జరిగిన ర్యాలీలో ప్రజలను ఉద్దేశించి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి 'యోగి ఆదిత్యనాథ్' కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో గూండా రాజకీయం పెరిగిపోయిందని, వంశపారంపర్య రాజకీయాలకు ముగింపు పలకడానికి ఎన్డీయేకి ఓటు వేయాలని యోగి ఆదిత్యనాథ్ ప్రజలను కోరారు. జరగబోయే ఎన్నికలు ఒక కుటుంబానికి.. దేశానికి మధ్య జరుగుతోందని అన్నారు. వంశపారంపర్య రాజకీయం దేశాన్ని ఉగ్రవాదం, అవినీతి వైపు నెడుతోందని పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన భారత్ ప్రధాని మోదీ కల. గత పదేళ్లుగా మారుతున్న భారత్‌ను మోదీజీ నాయకత్వంలో చూసారు. ఇప్పటికే భారతదేశ ప్రతిష్ట ప్రపంచమంతటా తెలిసింది. రాబోయే రోజుల్లో భారత్ ప్రపంచానికి నాయకత్వం వహించే స్థాయికి చేరుతుందని అన్నారు. నేడు యూపీలో కర్ఫ్యూ లేదు, అల్లర్లు లేవు.. బీజేపీ ప్రభుత్వం తమ వాగ్దానాలకు కట్టుబడి ఉంది. మాఫియా, నేరస్థులు జైలులో మగ్గుతున్నారు. మహిళలను బెదిరించడానికి సాహసించా లంటే నేడు అందరూ జంకుతున్నారు. ఎన్డీఏ ప్రభుత్వం వికసిత్ భారత్, వికసిత్ బీహార్‌ను సాధ్యం చేస్తుందని.. అది మోదీ వల్ల మాత్రమే సాధ్యమవుతుందని అన్నారు. కాంగ్రెస్ దాని మిత్రపక్షమైన ఆర్జేడీ.. రాముడి ఉనికిని ప్రశ్నించేవి, కానీ ప్రాణ ప్రతిష్ఠా కార్యక్రమంలో రామ్ లల్లా విగ్రహాన్ని ఆవిష్కరించిన తర్వాత, వారు ట్రాక్ మార్చి.. రాముడు అందరికీ చెందినవారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సమస్యలను సృష్టిస్తుంది. కాబట్టి ఎన్డీఏ కూటమిని గెలిపించండని యోగి ఆదిత్యనాథ్ కోరారు.



## మరో 2 వారాలు జైల్లోనే




**ఢిల్లీ:** లిక్కర్ స్కాం కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తన అరెస్టును సవాల్ చేస్తూ వేసిన పిటిషన్‌లో ఆయనకు ఊరట లభించలేదు. ఈడీ అరెస్టును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు ఇవాళ విచారణ జరిపింది. విచారణ జరిపిన జస్టిస్ సంజీవ్ ఖన్నా, దీపంకర్ దత్త ధర్మాసనం.. కేజ్రీవాల్ పిటిషన్‌పై ఈడీకి నోటిసులు జారీ చేసింది. ఏప్రిల్ 24 వరకు సమాధానం ఇవ్వాలని ఈడీని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈడీ సమాధానంపై ఏప్రిల్ 27 వరకు రిజాయిన్డెర్ దాఖలు చేయాలని కేజ్రీవాల్‌కు తరపు న్యాయవాదిని ఆదేశించింది. తదుపరి విచారణ ఏప్రిల్ 29కి వాయిదా వేసింది. ఈడీ అరెస్ట్ చట్ట విరుద్ధం అని ఎన్నికల్లో ప్రచారం చేసుకునేందుకు అవకాశం కల్పించాలని సుప్రీంకోర్టును కేజ్రీవాల్ తరపు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి కోరారు. ఈ కేసులో ఏం జరిగిందో తమకు తెలుసని సుప్రీంకోర్టు పేర్కొంది. ఢిల్లీ లిక్కర్ పాలసీ మనీ లాండరింగ్ కేసులో ఈడీ అరెస్ట్ చట్ట బద్దంగా, నిబంధనలకు అనుగుణంగా జరిగిందని హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ఏప్రిల్ 10న సుప్రీంకోర్టును కేజ్రీవాల్ ఆశ్రయించిన విషయం తెలిసిందే. లిక్కర్ పాలసీ స్కాం కేసులో ఈడీ సమన్లను సీఎం కేజ్రీవాల్ పదేపదే నిర్లక్ష్యం చేస్తూ వచ్చారు. దీంతో రంగంలోకి దిగిన ఈడీ మార్చి 21వ తేదీన ఆయన్ని అరెస్ట్ చేసింది. కేజ్రీవాల్ ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్నారు. 15వ తేదీ వరకు ఆయనకు జ్యుడీషియల్ కస్టడీ విధించారు. నేటితో ఆయన జ్యుడీషియల్ కస్టడీ ముగియనుంది. అదే సమయంలో లిక్కర్ కేసులో మరో నిందితుడు, ఆప్ మాజీ మంత్రి మనీష్ సిసోడియా బెయిల్ విచారణ కూడా నేడు జరగనుంది. రౌస్ అవెన్యూ కోర్టులో మనీష్ సిసోడియా దాఖలు చేసిన రెండో పిటిషన్ ఇది.

## మణిపుర్ ఎన్నటికీ భారత్‌లో అంతర్భాగమే..



చొరబాటు ద్వారా మణిపుర్ జనాభాను మార్చే ప్రయత్నాలు జరిగాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా సంచలన ప్రకటన చేశారు. మణిపుర్ ను విచ్ఛిన్నం చేసే శక్తులు, ఐక్యం చేసే శక్తుల మధ్య లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయని అన్నారు. ఎవరి ఎన్ని కుట్రలు చేసినా మణిపుర్ ను దేశం నుంచి వేరు చేసేందుకు తాము ఎన్నటికీ ఒప్పుకోబోమని స్పష్టం చేశారు. ఇంఫాల్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో అమిత్ షా ఈ కామెంట్లు చేశారు. రాష్ట్రంలో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని మణిపుర్ సీఎం బీరెన్ సింగ్ వెల్లడించారు. షెడ్యూల్డ్ తెగ (ఎస్టీ) హోదా కోసం మైతేయి డిమాండ్‌కు వ్యతిరేకంగా కొండ జిల్లాల్లో గిరిజన సంఘీభావ యాత్ర జరిగింది. గతేడాది మే 3న జరిగిన ఈ సంఘటన తీవ్ర హింసాత్మకంగా మారింది. ఘర్షణలు చెలరేగి 219 మంది మృతి చెందారు. మహిళలను వివస్త్రలు చేసి నగ్నంగా ఊరేగించిన వీడియోలు దేశ వ్యాప్తంగా పెను దుమారం రేపాయి. మహిళలపై అత్యాచారం, దాడులతో మణిపుర్ అట్టుడికిపోయింది. గత వారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అస్సాంకు చెందిన ఒక వార్తాపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆ రాష్ట్రంలో పరిస్థితి మెరుగుపడిందని చెప్పారు. వివాదాన్ని పరిష్కరించేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నామన్నారు. దేశమంతా వారి వైపే ఉందని మణిపుర్ ప్రజలకు భరోసా ఇచ్చారు. అందరం కలిసి ఈ సమస్యను పరిష్కరిస్తామని ప్రధాని మోదీ స్పష్టం చేశారు

## ఆ వ్యవస్థలు ప్రధాని మోదీ ఆస్తి కాదు... ప్రతి భారతీయుడివి



**చెన్నై :** బీజేపీ విడుదల చేసిన మేనిఫెస్టో పేదల కోసం కాదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. సోమవారం తమిళనాడులోని నీలగిరి పార్లమెంటరీ స్థానం నుంచి పోటీ చేస్తున్న డీఎంకే అభ్యర్థి ఎ.రాజాకు మద్దతుగా రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అనంతరం నీలగిరి నుంచి కేరళ వాయనాడ్‌కు వెళ్లే ముందు తాలూర్‌లో కాలేజీ విద్యార్థులతో సంభాషించారు. ఈ సందసర్భంగా బీజేపీ విడుదల చేసిన మేనిఫెస్టోలో పేదలకి లబ్ధి చేకూర్చే అంశాలు ఏమైనా ఉన్నాయా? అని ప్రశ్నించారు.

కానీ వీళ్లు 2036లో ఒలింపిక్స్ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చేందుకు భారత్ సిద్ధంగా ఉందని వ్యాఖ్యలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కేంద్రం ఎజెండా ఒకటే వన్ నేషన్ వన్ ఎలక్షన్ అని అన్నారు. పేదల కోసం బీజేపీ అనుసరిస్తున్న విధానాలు ఏమిటో? అని ప్రశ్నించిన రాహుల్ గాంధీ ..కాంగ్రెస్ మేనిఫెస్టోలో యువత, మహిళలు సహా అన్ని వర్గాల ప్రజలకు సంబంధించిన విధానాలు ఉన్నాయి. కానీ బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో 2036లో ఒలింపిక్స్ నిర్వహించాలని చెబుతోంది. కాంగ్రెస్, బీజేపీల మధ్య తేడా ఇదే అని వ్యాఖ్యానించారు. కాగా, బీజేపీ సంకల్ప్ పత్ర పేరుతో మేనిఫెస్టోని విడుదల చేసింది. రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని 27 మంది సభ్యుల బృందం 14 అంశాలతో మేనిఫెస్టోని రూపొందించింది. రాజ్యాంగ వ్యవస్థలు ప్రధాని నరేంద్ర మోదీ వ్యక్తిగత ఆస్తి కాదని, ప్రతి ఒక్క భారతీయుడికి చెందినవని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. సోమవారం ఆయన వయనాడ్ నియోజకవర్గంలోని వెల్లిముందాలో రోడ్డు షో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దేశంలోని అన్ని రాజ్యాంగ సంస్థలను హస్తగతం చేసుకోవడానికి కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రాజ్యాంగాన్ని రక్షించాలనుకునే వారికి... రాజ్యాంగాన్ని నాశనం చేయాలనుకునే వారికి మధ్య జరుగుతున్న పోరే ఈ లోక్ సభ ఎన్నికలు అని వ్యాఖ్యానించారు. మనం మాట్లాడే భాష, వర్గం, మతం, రాష్ట్రం అనే అంశాలతో సంబంధం లేకుండా అందరి హక్కులను పరిరక్షించేదే రాజ్యాంగం అన్నారు. రాజ్యాంగం దృష్టిలో అందరూ ఒక్కటే అన్నారు. మన దేశంలో రాజ్యాంగ సంస్థలను ఒక్కటొక్కటిగా చేజిక్కించుకోవాలని బీజేపీ ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. న్యాయవ్యవస్థ, ఎన్నికల సంఘం, సీబీఐ, ఈడీ, ఆదాయపు పన్ను శాఖ.. ఇలా అన్నింటిని వశం చేసుకోవాలని చూస్తోందన్నారు. ఆరెస్సెస్ తన వ్యక్తులను ఈ వ్యవస్థల్లోకి జొప్పిస్తోందని ధ్వజమెత్తారు. ఈ రాజ్యాంగ సంస్థలు దేశానికి చెందినవని... ఏ ఒక్క సంస్థకు చెందినవి కావని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తామని కొంతమంది బీజేపీ ఎంపీలు అప్పుడప్పుడు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ రాజ్యాంగాన్ని మార్చేందుకు కాంగ్రెస్ ఎప్పటికీ వారికి అవకాశమివ్వదని స్పష్టం చేశారు. సమాజం, మతం, రాష్ట్రంతో సంబంధం లేకుండా ప్రతి భారతీయుడిని రక్షించడమే కాంగ్రెస్ కర్తవ్యమన్నారు. కాగా కేరళలోని 20 లోక్ సభ స్థానాలకు ఏప్రిల్ 26న ఒకే దఫాలో పోలింగ్ జరగనుంది.

# కవితకు వార్నింగ్

-మొదటి పేజి తరువాయి

మాట్లాడవద్దు అంటూ వార్నింగ్ ఇచ్చారు. అనంతరం, కవిత బయటకు వస్తూ సీబీఐపై ఆరోపణలు చేశారు. ఈ సందర్భంగా కవిత.. "ఇది సీబీఐ కస్టడీ కాదు.. బీజేపీ కస్టడీ. రెండు నెలల నుంచి అడిగిందే అడుగుతున్నారు. బయట బీజేపీ అడిగిందే.. లోపల సీబీఐ అడుగుతోంది. ఇందులో కొత్తది ఏమీ లేదు" అని తీవ్ర ఆరోపణలు చేశారు. ఇదిలా ఉండగా.. మార్చి 15వ తేదీన ఈడీ లిక్కర్ స్కాం కేసులో కల్వకుంట్ల కవితను హైదరాబాద్‌లో అరెస్ట్ చేసింది. ఈడీ కస్టడీలో ఉన్న కవితను సీబీఐ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కవితను సీబీఐ అధికారులు మూడు రోజుల పాటు విచారించారు. లిక్కర్ స్కాంలో నిందితులు, అ?ప్రూవర్లుగా మారిన వారు వచ్చిన వాంగ్మూలం, వాట్సాప్ చాట్స్‌పై సీబీఐ కవితను ప్రశ్నించింది. ఈ సందర్భంగా కవిత విచారణను సీబీఐ వీడియో రికార్డు చేసింది. మరోవైపు.. ఆమె భర్త అనిల్, సోదరుడు, మాజీ మంత్రి కేటీఆర్, న్యాయవాది మోహిత్‌రావులు నిన్న(ఆదివారం) కవితతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో తాజా రాజకీయ పరిణామాలు, కోర్టులో అనుసరించాల్సిన వైఖరి తదితర అంశాలు చర్చించినట్లు సమాచారం. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో మార్చి 15న ఈడీ అధికారులు కవితను అరెస్టు చేయగా, ప్రత్యేక కోర్టు మధ్యంతర బెయిల్ నిరాకరించింది. ఇక, రెగ్యులర్ బెయిల్‌పై ఈ నెల 16న విచారణ జరగనుంది. ఉద్దేశ పూర్వకంగా తప్పుదోవ పట్టించేలా కవిత సమాధానాలు చెప్పారు. మాగుంట శ్రీనివాసులు రెడ్డి, గోరంట్ల బుచ్చిబాబు, శరత్ చంద్రారెడ్డి, విజయ్ నాయర్ తో జరిగిన సమావేశాలపై




ప్రశ్నించాం. ఆమె విచారణను, సాక్షులను ప్రభావితం చేయగలిగిన పలుకుబడి కలిగిన వ్యక్తి. కేసుకు సంబంధించిన ఆధారాలు ధ్వంసం చేయడంతో పాటు, చెరిపేసే అవకాశం ఉంది. కేసుకు సంబంధించి డిజిటల్ పరికరాలను, డాక్యుమెంట్లను పరిశీలించాల్సి ఉంది. ఈ క్రమంలో ఆమెను విచారించేందుకు మరింత సమయం కావాలి.' అని కోర్టును కోరింది. అందుకోసం మరో 14 రోజులు కస్టడీ పొడిగించాలని సీబీఐ కోరగా.. 9 రోజుల కస్టడీకి అనుమతించింది. దీంతో కోర్టు ఈ నెల 23 వరకూ కస్టడీ పొడిగించింది. మరోవైపు, కోర్టు నుంచి బయటకు వస్తున్న సమయంలో కవిత సీబీఐపై ఆరోపణలు చేశారు. ఇది సీబీఐ కస్టడీ కాదని, బీజేపీ కస్టడీ అని విమర్శించారు. 'సీబీఐ అధికారులు రెండేళ్ల నుంచి అడిగిందే అడుగుతున్నారు. బయట బీజేపీ వాళ్లు మాట్లాడేదే.. లోపల సీబీఐ వాళ్లు అడుగుతున్నారు. ఇందులో కొత్తది ఏమీ లేదు.' అని అసహనం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కవితపై న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టు ప్రాంగణంలో మీడియాతో మాట్లాడడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. మరోసారి అలా మాట్లాడవద్దంటూ హెచ్చరించారు. జర్నలిస్టులు ప్రశ్నలు అడిగినా ఎలా మాట్లాడుతారంటూ అసహనం వ్యక్తం చేశారు.

### కవితకు ధైర్యం చెప్పిన కేటీఆర్

ఢిల్లీ లిక్కర్ పాలసీ స్కామ్‌లో విచారణ ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను ఆమె సోదరుడు తెలంగాణ మాజీ మంత్రి కేటీఆర్ కలిశారు. ఈడీ కస్టడీలో ఉన్న కవితను సీబీఐ అధికారులు ఇటీవల అరెస్ట్ చేయడం తెలిసిందే. తమ కస్టడీలో ఉన్న ఎమ్మెల్సీ కవితను సీబీఐ అధికారులు ఆదివారం రెండో రోజు ఢిల్లీలోని తమ కార్యాలయంలో సుదీర్ఘంగా విచారించారు.. ప్రస్తుతం మూడు రోజుల సీబీఐ కస్టడీలో ఉన్న కవితను కలిసేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఢిల్లీకి వెళ్లారు. కేటీఆర్‌తో పాటు ఎమ్మెల్సీ కవిత భర్త అనిల్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సీబీఐ కేంద్ర కార్యాలయంలో కవితను కలిసి ధైర్యం చెప్పారు. న్యాయం తమవైపే ఉందని, అధైర్యపడవద్దని కవితకు సోదరుడు కేటీఆర్ ధైర్యం చెప్పారు. సోమవారం సీబీఐ కస్టడీ ముగియనుండటంతో మంగళవారం ఉదయం 10 గంటలకు కవితను రౌస్ అవెన్యూ కోర్టులో హాజరు పరచనున్నారు. కవిత కస్టడీ పొడిగించాలని సీబీఐ తరఫు లాయర్లు కోర్టును

# ఫోన్ ట్యాపింగ్... ప్రభాకరరావుకు ప్రాణహానీ...

**హైదరాబాద్ :** ఫోన్ ట్యాపింగ్ కేసులో ట్విస్టులు చూస్తుంటే గనక, సినిమా తీస్తే రికార్డుల మోత మోగడం ఖాయమనే టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు చుట్టూ కథంతా నడుస్తున్నా, ఆయన అమెరికా, దుబాయ్ అంటూ చక్కర్లు కొడుతున్నారు. హైదరాబాద్ వస్తారా? వస్తే ఏం జరుగుతుంది? ఇలా అనేక డౌట్స్ నడుమ తాజాగా ఆసక్తికర చర్చ ఒకటి జరుగుతోంది. అన్నిటికీ సెంట్రల్ పాయింట్‌గా మారిన ప్రభాకర్ రావు నగరానికి వచ్చేది లేనిదీ తెలియడం లేదు. కానీ, ఆయనపై అనేక ఒత్తిళు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. విచారణకు హాజరుకావాలా వద్దా? అంటూ ఆనాడు అధికారంలో పెత్తనం చెలాయించిన వారు రెండు వర్గాలుగా విడిపోయారు. ఇటీవల ఓ వర్గం దుబాయ్‌కి వెళ్లి సంప్రదింపులు జరిపినట్లు చర్చ జరుగుతోంది. అప్పటి ప్రభుత్వ సుప్రీం చెప్పినట్లు దేశానికి రావాల్సిన అవసరం లేదని తెల్చి చెప్పారట. ఎంత ఖర్చైనా తామే బరిస్తామని చెప్పారట. దీంతో దుబాయ్ నుంచి ప్రభాకర్ రావు ఎక్కడికి వెళ్లారనే సస్పెన్స్ కొనసాగుతోంది. మరోవైపు అరెస్ట్ అయిన ఆఫీసర్స్ ప్రభాకర్ రావు వస్తేనే తమపై ఒత్తిడి తగ్గుతుందని కుటుంబసభ్యులకు సమాచారం చేరవేస్తున్నారు. బెయిల్ రావాలంటే ప్రభాకర్ రావు పోలీసులకు సహకరించాలని కోరుతున్నారు. ఆయనను విచారించకుంటే తమకు ఇప్పట్లో బెయిల్ రాదని, ఎలాగైనా వచ్చేలా చేయాలని తెలిసిన పెద్దలతో పైరవీలు జరుపుతున్నారు. ఆయన వస్తేనే బెటర్ అనే ఫీలింగ్‌ను ప్రభాకర్ రావు ఫ్యామిలీకి కల్పిస్తున్నారు. డ్యూటీలో భాగంగా చేసినందున తొందరగానే బెయిల్ వస్తుందని మచ్చిక చేసుకుంటున్నారు. ప్రభాకర్ రావు 15 ఏండ్లుగా క్యాన్సర్‌తో సఫర్ అవుతున్నారు. నేరం చేయకముందే రోగం ఉందని తెలుసు. అంతా తెలిసే చేశారు. కానీ, ఇప్పుడు బెయిల్ పిటిషన్ కోసం తన ఆరోగ్యం సహకరించడం లేదని, ముందస్తు బెయిల్ ఇస్తే పోలీసులకు సహకరించేందుకు ప్రిపరేషన్స్ చేసుకుంటున్నట్టు సమాచారం. సుప్రీం అనుచరులు రావొద్దని చెప్పడంతో ఎలా ముందుకు వెళ్లాలో కొద్ది రోజులు వేచి చూడాలని ప్రభాకర్ రావు నిర్ణయం





తీసుకున్నట్టు తెలుస్తోంది. హైదరాబాద్ సీపీ కేసు విచారణలో సాక్ష్యాధారాలతో ముందుకు వెళ్తున్నారు. మాజీ మంత్రులైన దయాకర్ రావు, హరీష్ రావు, శ్రీనివాస్ గౌడ్‌ల పేర్లు ట్యాపింగ్ కేసులో వినిపిస్తున్నాయి. మరో ఎమ్మెల్సీతో పాటు గుమాస్తా తెలంగాణ పేపర్ ఓనర్, ఇప్పటికే విదేశాలకు వెళ్లిన ఐ న్యూస్ ఓనర్ శ్రావణ్ రావులు వారి వారికి అనుకూలంగా పైరవీలు మొదలు పెట్టారు. సెంట్రల్‌లో బీజేపీని కూడా వదలకుండా సంప్రదింపులు జరుపుతున్నారు. కొందరు కాంగ్రెస్ పెద్దలతో టచ్‌లో ఉన్నారు. ఏప్పుడంటే అప్పుడు కాంగ్రెస్ చీఫ్ ఖర్గేతో టచ్‌లో ఉండే ఓ మాజీ మంత్రి తనను రక్షించాలని వేడుకున్నట్టు సమాచారం. బీజేపీ అధిష్టానంతో టచ్‌లోకి వెళ్లిన తెలంగాణ పేపర్, ఐ న్యూస్ ఛానల్ ఓనర్స్ మీరే కాపాడాలని అందుకు ఏ పని చెప్పినా చేస్తామని చెప్పి హామీ తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇలా పైరవీలతో ఎవరికి వారు కేసు నుంచి బయటపడేందుకు ప్రయత్నిస్తున్నట్టు కనిపిస్తోంది. కులం కోసం మెడ కోసుకున్న ప్రభాకర్ రావు ప్రాణాలకు హాని ఉందని అత్యంత సన్నిహితులు భయపడుతున్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఈమధ్య మీడియా ముందుకు వచ్చి ఫోన్ ట్యాపింగ్‌పై మాట్లాడుతామని అన్నారు. అంతకు ముందు అన్నీ ప్రభాకర్ రావుకే తెలుసు అంటూ అరెస్ట్ అయినవాళ్లు స్టేట్మెంట్స్ ఇచ్చారు. ఇదే క్రమంలో పొలిటికల్ లింకులు బయటపడుతుండడంతో, అసలు సూత్రధారులు బయటపడకుండా ప్రభాకర్ రావుపై కుట్ర జరిగే ఛాన్స్ ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జాగ్రత్తగా పోలీసుల ముందు ఆయన్ను హాజరుపర్చాలని అభిమాన అధికారులు కోరుకుంటున్నారు. కొంతమంది న్యాయవాదులు ప్రభాకర్ రావుని సేఫ్‌గా హైదరాబాద్ తీసుకొచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టులో కేసు వేసేందుకు సిద్ధమయ్యారు.

# కాంగ్రెస్ నేతలను సమస్యలపై అడుగడుగునా రైతులు ప్రశ్నించాలి

**హైదరాబాద్:** కాంగ్రెస్ నేతలను రైతులు సమస్యలపై అడుగడుగునా ప్రశ్నించాలని కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం నాడు బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పార్లమెంట్ ఎన్నికల్లో ఓటేయమని అడిగితే ఏం చేశారని ప్రశ్నించాలని అన్నారు. ఎరువులు, విత్తనాలు అందకపోయినా రాష్ట్ర బీజేపీ కార్యాలయానికి తెలియజేయాలని సూచించారు. కాంగ్రెస్ చేసిన మోసాలకు ఆత్మహత్యలు చేసుకోవద్దని ధైర్యం చెప్పారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం.. రాష్ట్రంలో తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఏ కష్టం వచ్చిన తమకు చెప్పాలన్నారు. కౌలు రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదని మండిపడ్డారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల గురించి కాంగ్రెస్ నాయకులను రైతులు నిలదీసి అడగండి కానీ.. ఆత్మహత్యలకు పాల్పడవద్దని అన్నారు. కేంద్ర నిధుల నుంచి కిసాన్ సమ్మాన్ నిధి డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇవ్వాలని కోరారు. అర్హులు ఎవరున్నారో స్థానిక తహసీల్దార్ కార్యాలయాల్లో వివరాలు ఇవ్వాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెడితే తమకు ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. రైతులకు ఎలాంటి సమస్యలు అన్నా ఈ 9904119119 నంబర్‌కి కాల్ చేయాలని కిషన్‌రెడ్డి సూచించారు.



### తెలంగాణలో బీజేపీ గెలిచే స్థానాలు ఎన్నంటే..? కిషన్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని హిమాయత్‌నగర్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం కొనసాగుతోంది. ఎన్డీయే కూటమి దేశంలో 400 సీట్లు గెలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అలాగే తెలంగాణలో బీజేపీ డబుల్ డిజిట్ సీట్లు గెలుస్తామని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి లీడర్ లేదని, ఆ పార్టీకి ఓటు వేయడం వృధా అన్నారు. బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెలిచే పరిస్థితి లేదని, ఆ పార్టీ అభ్యర్థులకు డిపాజిట్లు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే మురికిలో వేసినట్టే అన్నారు. కాంగ్రెస్ పార్టీలు వచ్చిన సచ్చిన పోయేదేం లేదన్నారు. నేటి నుంచి దేశ వ్యాప్తంగా ఇంటింటికి బీజేపీ ప్రచారం స్టార్ట్ చేశామని తెలిపారు. అందరికంటే ముందే అభ్యర్థులను ప్రకటించాం.. ప్రచారాన్ని స్టార్ట్ చేశామన్నారు. దేశ వ్యాప్తంగా ఎక్కడ చూసిన మోదీ నినాదాలే వినిపిస్తున్నాయని అన్నారు. సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ రాష్ట్రాధ్యక్షుడైన కిషన్ రెడ్డి బీజేపీ అభ్యర్థిగా మళ్లీ పోటీ చేస్తున్నారు. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ నుంచి దానం నాగేందర్, బీఆర్ఎస్ నుంచి పద్మారావు గౌడ్ బరిలో ఉన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలక పరిణామం

-మొదటి పేజి తరువాయి



కేసులో దర్యాప్తు సందర్భంగా వెలుగుచూడటంతో హైదరాబాద్ పోలీసులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. దీనికి సంబంధించి మరో కేసు నమోదు చేయాలని నిర్ణయించారు. ఈ కేసు దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన అంశాల ఆధారంగా కొందరు ప్రజాప్రతినిధులు నోటీసులు ఇచ్చే అవకాశం ఉంది. ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు నేతృత్వంలో సాగిన ఈ అక్రమ ట్యాపింగ్ వ్యవహారంలో ఇప్పటికే సిట్ అధికారులు పలు కీలక ఆధారాలు సేకరించారు. 2018 డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలు, 2020లో జరిగిన దుబ్బాక, 2021 అక్టోబర్‌లో జరిగిన హుజూరాబాద్, 2022 అక్టోబర్ రెండో వారంలో జరిగిన మునుగోడు ఉప ఎన్నికలతో పాటు గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన సాధారణ ఎన్నికల సమయంలో ఈ నగదు అక్రమ రవాణా ఎక్కువగా జరిగినట్లు తేల్చారు. ఇక ట్యాపింగ్ కేసు దర్యాప్తు పూర్తి పారదర్శకంగా జరుగుతోందని నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్న విషయం తెలిసిందే.. సమయం వచ్చినప్పుడు అన్ని వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. రాజకీయ నాయకులకు నోటీసులు ఇచ్చే అంశం పైనా త్వరలో వివరాలను వెల్లడిస్తామని పేర్కొన్నారు.

## తెలంగాణకు వర్ష సూచన..



-మొదటి పేజి తరువాయి

కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నది. మరోవైపు గురు, శుక్ర, శని, ఆదివారాల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఇక, అకాల వర్షాల కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంట చేతికి వచ్చే సమయంలో వర్షాలు కురుస్తుండటంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# కమలంలో కుమ్ములాట!

-మొదటి పేజి తరువాయి

విడిపోయారు. పాత నాయకులంటే అనాదిగా పార్టీనే నమ్ముకుని ఉన్నవారు. వీరికి సంఘ నేపథ్యంతో బాటు జాతీయవాద భావజాలం, సామాజిక సమరసతా లక్ష్యాల వంటివాటితో బాటు గెలుపోటములతో సంబంధం లేకుండా పార్టీకి సేవలందించిన చరిత్ర ఉంది. ఇక.. కొత్త నాయకులు అంటే, వేరే పార్టీల నుంచి వలస వచ్చిన నేతలు. వీరిలో ఎక్కువ మంది కాంగ్రెస్, బీఆర్ఎస్, టీడీపీ వంటి పార్టీల నుంచి వచ్చినవారే. బీజేపీలో చేరిన ఈ నేతలకు అధిష్ఠానం అధిక ప్రాధాన్యం ఇవ్వటం పాతతరం నేతలకు కంటగింపుగా మారుతోంది. ఉదాహరణకు ఇటీవలి ఎన్నికల్లో నాగర్ కర్నూలు, జహీరాబాద్, వరంగల్, నల్గొండ, వరంగల్ వంటి సీట్లలో ప్రకటించిన అభ్యర్థులంతా వలస వచ్చినవారే. వీరిలో కొందరు పార్టీ మారిన మూడు రోజుల్లో టికెట్ కూడా సంపాదించగలిగారు. ఇది నచ్చని పాత నేతలు, కార్యకర్తలు వీరికి ఎన్నికల వేళ సహాయ నిరాకరణ చేస్తున్నారు. ఇక, డీకే అరుణ, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి వంటి వారూ పాతతరం నేతల దృష్టిలో నేటికీ వలస పక్షులే. ప్రచారం జోరుగా చేయాల్సిన ఈ కీలక సమయంలో పాత నేతలెవరూ వీరికి మద్దతుగా నిలవటం లేదుబీసీ నేతగా బలమైన మార్పు తీసుకొచ్చాడనే పేరున్న బండి సంజయ్‌ను తప్పించటంలోనూ ఇలాంటి రాజకీయమే గతంలో పనిచేసింది. అప్పట్లో ఆయన అవలంబించిన దూకుడును, ఒంటెత్తుపోకడగా అభివర్ణిస్తూ బీసీ నేతలే ఆయనకు అండగా నిలవలేదు. ఈ విషయంలో బీసీ వర్సెస్ నాన్ బీసీ అనే ప్రాతిపదికన తెలంగాణ బీజేపీ విడిపోయింది. కిషన్ రెడ్డి నాయకత్వంలో ఈ రాజకీయం సాగినట్లు అప్పట్లో వార్తలూ వచ్చాయి. దీనికి తోడు బండి సంజయ్, ప్రొ. లక్ష్మన్, ధర్మపురి అరవింద్ వంటి వారంతా మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన వారే కావటంతో పెత్తనమంతా ఒకే బీసీ వర్గం చేస్తుందనే భావనా తెలంగాణ బీజేపీ నేతల్లో ఉంది. తర్వాత పార్టీలో చేరిన ఈటల రాజేందర్ వంటి ఇతర కులాల నేతలకు తగినంత గుర్తింపు రాకుండా మున్నూరు కాపు నేతలు ప్రయత్నించారనే ఆరోపణ కూడా ఉంది. దీంతో బీజేపీ సానుభూతి పరులైన ఇతర బీసీ కులాలు పార్టీకి దూరమయ్యే పరిస్థితి నెలకొంటోంది. తాజా లోక్‌సభ ఎన్నికల వేళ.. ఒకే సామాజిక వర్గానికి చెందని నేతలు తోటి నేతల ఓటమికి అంతర్గతంగా పనిచేస్తున్నారనే మాటా ప్రస్తుతం వినిపిస్తోంది. కేంద్రంలో కేంద్ర పదవి దక్కే అవకాశం వస్తే.. తమ వర్గానికి చెందిన నేతలు పోటీవస్తారనే భయంతోనే వీరు తోటి అభ్యర్థుల ఓటమికి కుట్రలు చేస్తున్నారని, కొందరు నేతలు ఇంకొక అడుగు ముందుకు వేసి ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులకు సాయం అందిస్తున్నారనే వార్తలూ వినిపిస్తున్నాయి. మరోవైపు డబ్బు, పరపతి, వ్యాపారాలున్న నేతలకు పార్టీలో ఎక్కువ విలువ దక్కుతోందని, అనేక విషయాల్లో వారి మాటే చెల్లుబాటవుతోందని పాత తరం నేతలు లోలోపల వాపోతున్నారు. ఇలాంటి వలస నేతలు పార్టీ కష్టకాలంలో అలవోకగా తమ సొంత పార్టీలకు తిరిగెళ్లి పోతారని, కనుక ఇలాంటి కార్పొరేట్ ధోరణులు పార్టీకి చేటు చేస్తున్నాయనేది వారి వాదన. తెలంగాణలో మొత్తం 17 లోక్‌సభ సీట్లుండగా వాటిలో సగానికి పైగా వలస నేతలే టికెట్లు దక్కించుకోవటం, వారితో బాటే వారి అనుచరులూ పార్టీలో చేరి పెత్తనం చెలాయించటం కూడా ఎన్నికల వేళ కొత్త సమస్యలు తెచ్చిపెడుతోంది. దీనివల్ల పాత, కొత్త నేతల మధ్య సమన్వయం లోపించి, ఎవరికి వారుగా వ్యవహరిస్తున్నారు. దీనివల్ల ముందునుంచీ సాగుతోన్న ఎన్నికల ప్రచార కార్యక్రమాలన్నీ మూలనపడ్డాయి. ఈ విషయాలను పార్టీ ఇన్‌ఛార్జ్‌లు ఢిల్లీలోని పెద్దలకు చెప్పినా పరిస్థితిలో ఏ మార్పూలేదని, నిన్నటి దాకా అధికార పార్టీపై ఉన్న వ్యతిరేకతను ఓటు బ్యాంకుగా మార్చుకోవటానికి ప్రయత్నించిన తమ పార్టీ, కీలకమైన లోక్‌సభ ఎన్నికల వేళ నష్ట నివారణ చర్యలకు దిగాల్సి రావటం దురదృష్టమని ఆ పార్టీ అభిమానులు ఆక్రోశిస్తున్నారు.

## భద్రాచలం సీతారాముల కల్యాణం ప్రత్యక్ష ప్రసారానికి ఈసీ అనుమతి నిరాకరణ

**ప్రత్యక్ష ప్రసారానికి అనుమతి కోరుతూ మరోసారి సీఈఓకు లేఖ రాసిన మంత్రి కొండా సురేఖ**

**ఆలయ విశిష్టత, సంప్రదాయాలు వివరిస్తూ ఈసీకి మంత్రి లేఖ**

**కల్యాణ మహోత్సవం ప్రత్యక్ష ప్రసారం చేయడం గత 40 ఏళ్లుగా జరుగుతోందన్న మంత్రి**

ఈ నెల 17వ తేదీన శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో నిర్వహించే భద్రాద్రి సీతారాముల కల్యాణం ప్రత్యక్ష ప్రసారానికి తాజాగా ఎలక్షన్ కమిషన్ (ఈసీ) అనుమతి నిరాకరించింది. దీంతో మంత్రి కొండా సురేఖ ప్రత్యక్ష ప్రసారానికి అనుమతి కోరుతూ మరోసారి సీఈఓకు లేఖ రాశారు. ఆలయ విశిష్టత, సంప్రదాయాలు వివరిస్తూ ఈసీకి మంత్రి లేఖ రాశారు. కల్యాణ మహోత్సవం ప్రత్యక్ష ప్రసారం చేయడం గత 40 ఏళ్లుగా జరుగుతోందని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు.

## సంపాదకీయం

# నిరుద్యోగంపై అదే నిర్లక్ష్యం!

ఎన్నికల సమయాలలో దేశం ఎదుర్కొనే ప్రధాన సమస్యల గురించి చర్చలు జరగాలి, రాజకీయ పార్టీలు సైతం ఆయా సమస్యలకు తామే విధంగా పరిష్కార మార్గాలు చూపుతామో చెబుతూ ప్రజల ముందుకు రావా లి. కానీ ప్రస్తుత ఎన్నికలలో ప్రధాన రాజకీయ పక్షాలు ప్రత్యర్థులపై అనుచిత విమర్శలు కురిపిస్తూ, భావోద్వేగాలు రెచ్చగొడుతూ, సంక్షేమ కార్యక్రమాలను చూపెడుతూ ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నాలే ఎక్కువగా చేస్తున్నాయి. నేడు దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య నిరుద్యోగ యువత. ఈ సమస్య గురించి అధికార, ప్రతిపక్షాలు చెప్పుకోదగిన విధంగా స్పందించడం లేదు. గత పదేళ్లలో 25 కోట్ల మంది ప్రజలను పేదరికం నుండి బయట పడవేసానని చెప్పుకొంటున్న ప్రధాని నరేంద్ర మోడీ మొత్తం ప్రపంచం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ఇదో పెద్ద ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేశామని కూడా చెప్పుకుంటున్నారు.
కానీ తమ పాలనలో పెరుగుతున్న నిరుద్యోగ యువత గురించి మాటమాత్రం కూడా ప్రస్తావించే సాహసం చేయలేకపోతున్నారు. ప్రధాని మాటలలోనే 80 కోట్ల మంది ప్రజలకు ఉచితంగా ప్రభుత్వం రేషన్ అందిస్తున్నట్లు వెల్లడవుతుంది. మరికొన్నేళ్లు ఈ సదుపాయం కొనసాగిస్తున్నట్లు కూడా ప్రకటించారు. దేశం ఎదుర్కొంటున్న భయంకరమైన ఆహార సంక్షోభాన్ని ఇది సూచిస్తుంది. చాలా కాలం పాటు నాలుగు ఏళ్ళ అవసరాలకు సరిపడిన ఆహార ధాన్యాలను గిడ్డంగులలో నిల్వచేయలేక, పురుగులు పట్టి విపరీత నష్టంకు గురవుతూ ఉండేవాళ్ళం. కానీ ఇప్పుడు ఎక్కడ ఆహార ధాన్యాల కొరత ఏర్పడుతుందో అన్నభయంతో ఎగుమతులపై ఆంక్షలు విధిస్తూ రైతుల నడ్డి విరుస్తున్నారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇటీవల ప్రకటించిన 'ఇండియా ఎంప్లాయ్‌మెంట్ రిపోర్ట్ 2024' భారత దేశంలోని నిరుద్యోగ శ్రామికశక్తిలో 80 శాతం మంది యువత ఉన్నట్టు వెల్లడి చేసింది. మరీ ముఖ్యం గా, సెకండరీ విద్య లేదా అంతకంటే ఎక్కువ ఉన్న యువతలో నిరుద్యోగం 2000లో 35.2 శాతం నుండి 2022లో 65.7 శాతానికి పెరిగింది. నేడు విద్యావంతులైన యువత భయంకరమైన నిరుద్యోగం ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ఎంతో ప్రచారం కలిపిస్తున్న నైపుణ్యాభివృద్ధి, స్టార్ట్ యాప్ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో చెప్పుకోదగిన ప్రభావం చూపలేకపోయాయి. భారతదేశ ప్రధాన ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వరన్ సైతం '2000 నుండి 2019 మధ్యకాలంలో యువత నిరుద్యోగం రెండు రెట్లు ఎక్కువ పెరిగింది, 5.7 శాతం నుండి 17.5 శాతానికి పెరిగింది.కానీ 2022లో 12.4శాతానికి తగ్గింది' అని చెప్పుకొచ్చారు. ప్రధానంగా మహిళల ఉపాధి అవకాశాలు తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తున్నది. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని ప్రకటించిన ప్రధాని మోడీ ఇప్పుడా అంశాన్ని ప్రస్తావించడం లేదు. దేశంలోని శ్రామిక శక్తిలో 46% మంది కలిగి ఉన్న వ్యవసాయ రంగంపై కేవలం 5% పెట్టుబడులు మాత్రమే అందుతున్నాయి. యాంత్రీకరణను ప్రోత్సహిస్తున్న కారణంగా వ్యవసాయరంగంలో ఉద్యోగాల సృష్టి జరగడం లేదు. 8% ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్న మాటలు సైతం తప్పుడు సంకేతాలు ఇస్తున్నాయి. కేవలం సంఘటిత రంగంలోని జిడిపిని మాత్రమే పరిగణనలోకి తీసుకొంటున్నారు. కీలకమైన అసంఘటిత రంగాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటే వృద్ధి రేటు 1- 2 శాతంకు మించని పరిస్థితి నెలకొంది. మరోవంక వ్యవసాయేతర రంగాలలో ఉద్యోగాల సంఖ్య కూడా పడిపోతున్నది. గత ఎనిమిదేళ్లలో, 2013లో 7.5 మిలియన్ల నుండి 2019 నాటికి 2.9 మిలియన్లకు క్షీణించింది. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న 10 సంవత్సరాలలో, ఆర్థిక వ్యవస్థ ప్రతి సంవత్సరం 7.5 మిలియన్ల వ్యవసాయేతర ఉద్యోగాలను సృష్టిస్తూ ఉండడంతో, ప్రతి ఏడాది 5 మిలియన్ల మంది ప్రజలు వ్యవసాయం నుండి నిష్క్రమించే అవకాశం కలిగెడిది. లాక్‌డౌన్ ఫలితంగా 2020లోనే 3.5 కోట్ల మంది ప్రజలు వ్యవసాయం వైపు మళ్లారు. కరోనా రెండవ వేవ్ మరో కోటి మంది వ్యవసాయం వైపు వెళ్లారు. వ్యవసాయంలో ఆర్థిక ఉత్పాదకత తక్కువగా ఉంటూ ఉండడంతో మన జిడిపిలో 15% మాత్రమే అందిస్తుంది. జాతీయ శాంపిల్ సర్వే ఆఫీస్ డేటా ప్రకారం 2017-18, నిరుద్యోగం గత 45 ఏళ్లలో అత్యధిక స్థాయిలో ఉంది. 2012లో 2.2 శాతం నుంచి 6.1 శాతానికి పెరిగింది. గత దశాబ్దంలో 15 నుండి 29 సంవత్సరాల మధ్య ఉన్న యువత నిరుద్యోగం స్థాయి రెట్టింపు, మూడు రెట్లు పెరిగాయి. పేదరికం స్థాయి కూడా విపరీతంగా పెరగడంలో ఆశ్చర్యం లేదు. ప్రపంచ బ్యాంకు సెప్టెంబర్ 2022 నివేదికలో పేదరికంలో నివసించే వ్యక్తులు 70 మిలియన్లు పెరిగారని పేర్కొంది. వీటిలో 56 మిలియన్లు భారతదేశం నుండి మాత్రమే రావడం గమనార్హం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలో, ప్రభుత్వ రంగ సంస్థలలో ఉద్యోగ నియామకాలు మొక్కుబడిగా మారాయి. లక్షలాది ఖాళీలను భర్తీ చేయడం లేదు. తాత్కాలిక ఉద్యోగులతో కాలం గడిపేస్తున్నారు. పైగా, దాదాపు అన్ని ప్రభుత్వ శాఖలలో కీలకమైన పనులను ప్రైవేట్ వారికి అప్పగిస్తున్నారు. ఒక విధంగా ప్రభుత్వ యంత్రాంగపు ప్రైవేటీకరణ ప్రక్రియ తెలియకుండానే జరుగుతున్నది. దానితో రెగ్యులర్ ఉద్యోగాలు లభించడం నేడు దాదాపు అసాధ్యమవుతుంది. దేశంలోని అత్యున్నత విద్యాసంస్థలుగా పేరొందిన ముంబై ఐఐటి, మద్రాస్ ఐఐటిలలోనే మూడవ వంతుకు పైగా పట్టభద్రులకు ఉద్యోగావకాశాలు లభించడం లేదని వెల్లడవుతుంది. దేశంలో విద్యావంతులైన యువకులలో నిరుద్యోగం ఎటువంటి సంక్షోభకరంగా మారుతుందో ఈ ధోరణి వెల్లడి చేస్తున్నది. రెగ్యులర్ ఉద్యోగాలు లభించకపోవడంతో విద్యావంతులు సైతం అసంఘటిత ఉద్యోగులుగా మారిపోతున్నారు. లేనిపక్షంలో స్వయం ఉపాధి పేరుతో నిలకడలేని ఉపాధి అవకాశాలను వెతుక్కుంటున్నారు. ప్రపంచంలోనే యువకులైన శ్రామికులు అత్యధికంగా ఉన్న దేశంగా భారత్‌ను చెప్పుకుంటూ వస్తున్నాము. అయితే క్రమంగా వృద్ధాప్య దేశంగా మారుతూ ఉండడంతో యువతకు ఉపాధి అవకాశాలు మరింత సమస్యగా మారే ప్రమాదం కనిపిస్తోంది. ఆరేళ్ల క్రితం, మన శ్రామికశక్తిలో 32% మంది 45 ఏళ్లు పైబడి ఉండగా, నేడు 49% మంది 45 ఏళ్లు పైబడిన వారు ఉన్నారు. మరో 16 ఏళ్లలో 91% మందికి వృద్ధాప్య పింఛన్లు, ఇతర సామాజిక భద్రత, ఆరోగ్య ప్రయోజనాలు అందుబాటులో లేని వృద్ధాప్య సమాజంగా భారతదేశం మారే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. 65 సంవత్సరాల కంటే ఎక్కువ వయసు ఉన్న వారి కోసం ఉద్దేశించిన జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం (ఎన్ఎస్ఎపి) వంటి పథకాలకు కేటాయింపులు ఏమాత్రం పెరగడం లేదు. కరోనా సమయంలో రద్దు చేసిన సీనియర్ సిటిజన్లకు రైల్వే ఛార్జీల రాయితీని ఇప్పటివరకు పునరుద్ధరించకపోవడం గమనార్హం. గత దశాబ్దంలో, వృద్ధులకు ఎన్ఎస్ఎపి కింద పెన్షన్ మొత్తాలు 2011 నుండి స్తబ్దుగా ఉన్నాయి. కేటాయింపులు సైతం గత 10 సంవత్సరాలుగా దాదాపు రూ. 9,500 కోట్ల వద్ద నిలిచిపోయాయి. సుప్రీంకోర్టు నిషేధించిన తర్వాత కూడా ఎలక్టోరల్ బాండ్లను ముద్రించేందుకు ప్రభుత్వం ఏకంగా రూ. 10,000 కోట్లు వెచ్చించిందని వార్తలు వస్తున్న తరుణంలో ఇటువంటి కీలక సంక్షేమ పథకానికి కేటాయింపులు మొక్కుబడిగా ఉండటం గమనార్హం. మొత్తం బడ్జెట్‌లో ఎన్ఎస్ఎపికి కేటాయింపులు 2014- 15లో 0.58% నుండి ప్రస్తుత బడ్జెట్‌లో కేవలం 0.2%కి తగ్గిపోయాయి. విచారకరమైన అంశం ఏమిటంటే పెరుగుతున్న నిరుద్యోగ సంఖ్యకు, ద్రవ్యోల్బణం కూడా తోడవడంతో ప్రజల కొనుగోలుశక్తి చెప్పుకోదగినంతగా పెరగడం లేదు. దానితో పారిశ్రామిక వేత్తలు ఉత్పాదక రంగంలో మరిన్ని పెట్టుబడులకు సాహసం చేయడం లేదు. దాని ఫలితంగా యువతకు ఉద్యోగ అవకాశాలు పెరగడం లేదు. ఇదంతా ఒక విషవలయంగా మారుతున్నది. ప్రభుత్వం సైతం ఉపాధి అవకాశాలు ఎక్కువగా కల్పించగల విద్య, ఆరోగ్య, సామాజికరంగాలలో పెట్టుబడులను పెంచకపోగా, క్రమంగా వెనుకడుగు వేస్తున్నది. దానితో సమస్యలు మరింత తీవ్రతరం అవుతున్నాయి. యువతకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నట్లు దాదాపు అన్నిరాజకీయ పార్టీల నేతలు చెబుతున్నా ఆ దిశలో సరైన విధానాలతో మాత్రం ప్రజల ముందుకు రావడం లేదు. ముఖ్యంగా మధ్య తరహా, చిన్న తరహా పరిశ్రమలలో పెట్టుబడులు పెరగడం లేదు. ఆర్థిక సంస్థలు, బ్యాంకులు వాటిపట్ల

# అసాధారణ ప్రజ్ఞాశీలి నరసింహారావు

ఆంధ్ర నాటక రంగ చరిత్రలో నరసింహారావుది ప్రత్యేక స్థానం. నాటక రంగం మనగలిగినంత కాలం ఆయన పేరు శాశ్వతంగా నిలిచి పోతుంది. ఆయన స్త్రీ పాత్రధారణలో అసాధారణ ప్రజ్ఞ కనబరచి నాటక రంగానికే వన్నె తెచ్చారు. పురుషులే స్త్రీ వేషాలు వేసే ఆనాటి రోజుల్లో రంగస్థలంపై విభిన్నమైన, పరస్పర విరుద్ధమయిన పాత్రలను ధరించి, ధరించిన ప్రతి పాత్రలోను తమదైన ప్రత్యేకతను చూపించి లీనమై, ముప్ఫయి సంవత్సరాలపాటు లక్షలాది మంది ప్రేక్షకులను మంత్ర ముగ్ధుల్ని చేసిన ప్రతిభ ఆయనకే సొంతం. నటకావతంస, నటశేఖర, నాటకకళా ప్రపూర్ణ, పద్మశ్రీ వంటి బిరుదులు, పురస్కారాలు ఆయనను వరించాయి. స్థానం నరసింహారావు (సెప్టెంబర్ 23, 1902 – ఫిబ్రవరి 21, 1971) ప్రసిద్ధ రంగస్థల, తెలుగు సినిమా నటులు. సత్యభామ, చిత్రాంగి మొదలైన అనేక స్త్రీ పాత్రలను సుమారు 40 సంవత్సరాలకు పైగా ధరించి 3వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. ప్రేక్షకాభిమానంతో సహా పద్మశ్రీ పురస్కారం పొందాడు. స్థానం నరసింహారావు 1902, సెప్టెంబర్ 23 న హనుమంతరావు, ఆదెమ్మ దంపతులకు గుంటూరు జిల్లా బాపట్ల లో జన్మించారు. ఆయన చిన్నతనంలో కూచిపూడి భాగవతులు వచ్చి బాపట్లలో ప్రదర్శనలు ఇచ్చేవారు. అందులో వెంపటి వెంకటనారాయణ అనే ఆయన భామ వేషం అద్భుతంగా కట్టేవారట. ఆ స్త్రీ వేషం తన మనసులో ఎంతో ఆదరంతో మనసులో నిలిచి పోయి ఉండేదని చెప్పారు. ఈ దృశ్యాలన్నీ ఆయన రంగస్థల ప్రవేశం చేయడానికి దోహ దం చేశాయి. 1921లో బాపట్ల లోనే జంట కవులైన తిరుపతి వేంకట కవులకు, కొప్పరపు కవులకు శతావధానం పోటీ జరిగింది. నెగ్గిన తిరుపతి వేంకటకవులని సత్కరిం చాలని భావించారు. ఆ సందర్భం గా ప్లీడరు గుమస్తాల బృందం చేత సత్య హరిశ్చంద్ర నాటకం వేయించాలని నిర్ణయించారు. ఆహ్వానాలు వెళ్లిపోయాయి. కానీ చంద్రమతి వేషధారి అస్వస్థుడై రాలేకపోతున్నట్టు చివరి నిమిషం లో తెలిసింది. ప్రత్యామ్నాయం ఏదీ సాధ్యం కాలేదు. చంద్రమతి పాత్రధారి మరొకరు దొరకలేదు. మరో నాటకం వేద్దామంటే పాత్రధారులంతా లేరు. గుండెల్లో రాయి పడింది. అప్పుడే ఆపద్బాం ధవుడిలా స్థానం దొరికాడు చోర గుడి హనుమంతరావుకి. వారి నాటకం రిహార్సల్స్ జరుగుతున్నప్పుడు వెళ్లి కూర్చోవడంతో పద్యాలన్నీ వచ్చేశాయి. ఒకసారి ఎవరూ లేనప్పుడు పాడుకుంటూ ఉంటే హనుమంతరావు విన్నారు. ఆ ధైర్యంతోనే చంద్రమతి వేషం వేయించారు. స్థానం వారికి చిన్న తనంలోనే చిత్రలేఖనం కూడా అబ్బింది. ఆ కళతోనే, వేరే ఒకరి ఇంట రహస్యంగా తన వేషం తనే వేసుకున్నారాయన. చిన్న చిన్న లోపాలు ఉన్నా అరంగేట్రంలోనే తిరుపతి కవుల ఆశీస్సులు అందు కున్నారు స్థానం.తెనాలిలోని శ్రీరామ విలాస సభలో ప్రవేశించి ఆకాలంలోని గొప్ప నటులందరి సరసన పాత్రలు ధరించి దేశమంతటా పర్యటించి అపారమైన అనుభవం సంపాదించారు. వరంగల్‌లో 'కృష్ణలీల' నాటకంలో యశోద వేషం వేసినందుకు ఆయన జీవితంలో తొలి బంగారు పతకం వచ్చింది. అనతికాలంలోనే ఆయన పేరు మారుమోగి పోయింది. కాపురం బాపట్ల నుంచి తెనాలికి మారింది. "శ్రీరామవిలాస సభ" అనే నాటక సమాజాన్ని స్థాపించి నటననే జీవికగా చేసుకున్నారు. రోషనార (రోషనార నాటకం), తామీనా (రుస్తుం సొహరాబ్ నాటకంలో), సంయుక్త (రాణీ సంయుక్త), శకుంతల (అభిజ్ఞాన శాకుంతలం), సత్యభామ (శ్రీకృష్ణ తులాభారం), చిత్రాంగి (సారంగ ధర), దేవదేవి (విప్రనారాయణ), కోకిల (కోకిల నాటకం), మల్లమ్మ (బొబ్బిలి), మధురవాణి (కన్యా శుల్కం), అనసూయ (అనసూయ నాటకం), మురాదేవి (చంద్ర గుప్త), చింతామణి (చింతామణి), సుభద్ర (వీరాభిమన్యు), సరళ (ఛత్రపతి శివాజీ), విద్యాధరి (కాళిదాసు), చండిక (చండిక నాటకం) వంటి పాత్రలు వేశారు. ఎన్ని పాత్రలు పోషించినా, ఆయన వేసిన సత్య భామ పాత్ర పోషణ న భూతో న భవిష్యతి. "మీర జాల గలడా నా యానతి" అన్న పాటకు ఆయన చేసిన గాత్రం, చూపిన అభినయం నాటక ప్రేక్షకుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోయాయి. ఆంధ్రదేశంలో దాదాపు 3,000 సార్లు రంగస్థలం మీద పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాలలో స్త్రీ పాత్రలను ధరించి ప్రజాభిమానాన్ని చూరగొన్నాడు. శృంగార రసాన్ని ప్రతిబింబించే రీతిలో సత్యభామ పాత్ర, ప్రణయానికి చిత్రాంగిగా, వీరరసాన్ని చిత్రించడంలో రోషనార నాటకంలో రోషనారగా, వలపుల చింతామణిగా, ప్రణయదేవతగా, భక్తురాలిగా, దేవదేవిగా, మధురాతి మధురమైన మధురవాణిగా నవరసాలు కలిగిన పాత్రలను ప్రతిభావంతంగా పోషించాడు. వేషధారణ, వస్త్రాలంకరణలో స్థానం వారిది ఒక ప్రత్యేకత. రకరకాల చీరకట్టు సొగసులతో మనోహరంగా రంగస్థానం మీదకు ప్రవేశించి ప్రేక్షకుల్ని మంత్ర ముగ్ధ ల్ని చేశారు.వీరు సినీ రంగంలో రాధాకృష్ణ (1939), సత్యభామ) వంటి కొన్ని సినిమాలలో నటించారు. 1931 నుండి 1942 వరకు మద్రాసులో సినీనటుడిగా వున్నారు. ఆయన పాడిన పాటలు, పద్యాలు గ్రామ ఫోన్ రికార్డులుగా వచ్చి శ్రోతల్ని ఎంతగానో అందించాయి. తన నటనానుభవాలను చేర్చి "నట స్థానం" అనే గ్రంథాన్ని ఆయన రచించారు.స్థానం నరసింహారావు 1971 ఫిబ్రవరి 21 తేదీన మరణించారు. 1956లో భారత ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. ఆయన ఈ బహుమతిని పొందిన తొలి ఆంధ్రుడు, కళాకారుడు. ఆయన రంగ స్థలం పై చూపించిన సమయ స్ఫూర్తికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 10వ తరగతి తెలుగు వాచకంలో ఒక పాఠం కూడా పెట్టింది. అయన నటనకు ముగ్ధులైన రంగూన్ ప్రజలు 1938లో బంగారు కిరీటాన్ని బహూకరించారు.

# నవయుగ వైతాళికుడు వీరేశలింగం

తెలుగులో తొలి నవల రచనకు నాంది పలికిన గొప్ప కవి ఆయన. మొదటి స్వీయ చరిత్ర రాసిన మహోన్నత వ్యక్తి ఆయనే. తెలుగులో తొలి ప్రహసనం వ్రాసింది కూడా ఆయనే. మొట్ట మొదటి వితంతు వివాహం జరిపించిన గొప్పతనం ఆయనదే. ఆయనే నవయుగ వైతాళికుడిగా ప్రఖ్యాత గాంచిన కందుకూరి వీరేశలింగం పంతులు.బాల్యవివాహాల రద్దుకోసం ఉద్యమించిన మహోన్నతుడు, గొప్ప సంఘ సంస్కర్త. మూఢ నమ్మకాలపై యుద్ధం ప్రకటించిన బహుముఖ ప్రజ్ఞాశాలి కందుకూరి వీరేశలింగం పంతులు 1848 ఏప్రిల్ 16 రాజమండ్రిలో జన్మించారు. బ్రిటిష్ హయాంలో బాల్య వివాహాలను నిరసిస్తూ ఆయన పెద్ద ఎత్తున ఉద్యమమే నిర్వహించారు. దీంతోపాటు అనేక సంఘ సంస్కరణలకు పాటు పడ్డారు. సామాజిక దురాచారాల నిర్మూలన కోసం నిరుప మానంగా కృషి చేశారు. ఆధునికాంధ్ర సమాజ పితామహుడిగా కీర్తి గడించిన కందుకూరి, బాల్య వివాహాలు రద్దు కోసం ఉద్యమిస్తూనే .. వితంతు వివాహాలు జరిపించాలని కోరేవారు. దేశంలో మొదటి వితంతు వివాహం జరిపింది ఆయనే. సాహితీ వ్యాసంగంలోనూ విశేషంగా కృషిచేశారు కందుకూరి వీరేశలింగం పంతులు. బహుముఖ ప్రజాశాలి అయిన కందుకూరి. మొట్టమొదటి సహవిద్యా పాఠశాలను కూడా ప్రారంభించారు. తెలుగులో తొలి నవల వ్రాసింది. మొదటి స్వీయ చరిత్ర రాసింది కూడా ఆయనే. అంతేగాక తొలి ప్రహసనం కూడా కందుకూరి చేతినుంచి జాలువారింది. కందుకూరి జయంతిని నాటకరంగ దినోత్సవంగా జరుపుకుంటారు.



జాతికి నవయుగ వైతాళికుడు, సంఘ సంస్కర్త, మన తెలుగు జాతి గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి . సంఘ సంస్కరణకు, సామాజిక దురాచారాల నిర్మూలనకు,తెలుగు సాహితీ వ్యాసంగంలోనూ నిరుపమానమైన కృషి చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి. యుగకర్త గా, హేతువాదిగా ప్రసిద్ధి పొందిన ఆయనకు గద్య తిక్కన అనే బిరుదు ఉంది. ఒక వ్యక్తిగా, సంఘసంస్కర్తగా, రచయితగా అనేక విషయాలలో ఆంధ్రులకు ఆయన ఆద్యుడు, ఆరాధ్యుడు. తెలుగు కవుల జీవిత చరిత్ర రాసిన మొదటి వ్యక్తి. విజ్ఞాన శాస్త్ర గ్రంథాలను తెలుగులోకి అనువదించిన తొలి తెలుగు రచయిత. ఆంధ్ర దేశంలో బ్రహ్మ సమాజం స్థాపకులు. యువజన సంఘాల స్థాపన కూడా ఆయనతోనే మొదలయింది. సమాజ సేవ కొరకు హితకారిణి అనే ధర్మ సంస్థను స్థాపించి, తన యావదాస్తిని దానికి ఇచ్చేశారు. 25 సంవత్సరాల పాటు రాజమండ్రిలో తెలుగు పండితుడిగా పనిచేసి, మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో తెలుగు పండితుడిగా ఐదేళ్ళు పని చేసారు. తాము నమ్మిన సత్యాన్ని, సిద్ధాంతాన్ని తు.చ. తప్పకుండా పాటించిన ఆదర్శ వ్యక్తి. యుగకర్త గా ప్రసిద్ధి పొందిన ఆయనకు గద్య తిక్కన అనే బిరుదు ఉంది. ఆంధ్ర సమాజాన్ని సంస్కరణాల బాట పట్టించిన సంస్కర్త, వీరేశలింగం. ఆయన చేసిన ఇతర సంస్కరణా కార్యక్రమాలొక ఎత్తు, వితంతు పునర్వివాహాలొక ఎత్తు. అప్పటి సమాజంలో బాల్యంలోనే ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేసేవారు. కాపురాలకు పోకముందే భర్తలు చనిపోయి, వితంతువులై, అనేక కష్టనష్టాలు ఎదుర్కొనే వారు. దీనిని రూపుమాపేందుకు వితంతు పునర్వివాహాలు జరిపించాలని విస్తృత ప్రచారం చేసారు.వీరేశలింగం హేతువాది. ఆయన జీవితం సంఘసంస్కరణ, సాహిత్య కృషి రెండింటితో పెనవేసుకు పోయింది. ప్రభుత్వంలోని అవినీతిని ఏవగించుకుని ప్రభుత్వ ఉద్యోగ ప్రయత్నాన్ని, అబద్ధాలు ఆడక తప్పదని న్యాయవాద వృత్తిని వదులుకున్న వ్యక్తి అటువంటి దురాచారాలపై ధ్వజమెత్తి, తన సంస్కరణా భిలాషను నిరూపించుకున్నారు. ఉన్నత విద్యానంతరం వీరేశలింగం అధ్యాపక వృత్తిని చేపట్టారు. రాజమండ్రి, కోరంగి, ధవళేశ్వరం, మద్రాసులలోని పాఠశాలల్లో పని చేశారు. అధ్యాపకుడిగా పనిచేస్తుండడంతో 'పంతులు'గారని, వీరేశలింగం పంతులుగారని ప్రాచుర్యం పొందారు. సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి 1876లో ఉపాధ్యాయవృత్తి నుండి జర్నలిస్టుగా మారి 'వివేకవర్ధిని' అనే మాసపత్రికను ప్రారంభించారు. మొదట ఈ పత్రిక మద్రాసు నుండి వచ్చేది. తర్వాత కొంతమంది స్నేహితులతో కలిసి, రాజమండ్రి లోనే సొంత ప్రింటింగ్ ప్రెస్ ఏర్పాటు చేసుకుని అక్కడి నుంచి పత్రికను నిర్వహించారు.ఆ రోజుల్లోనే లంచగొండితనం, మూఢ నమ్మకాలు, బాల్య వివాహాలు%ౌ% ఇలా ఎన్నో అన్యాయాలు సమాజంలో జరుగుతుండేవి. వాటిపైకి తన పత్రిక 'వివేకవర్ధిని'ని ఆయన ఎక్కుపెట్టారు. ఉపన్యాసాలకే పరిమితం కాకుండా ప్రత్యక్షంగా, ఆచరణాత్మకంగా సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. తొలి వితంతు పునర్వివాహాన్ని 11 డిసెంబర్ 1881న తన ఇంట్లోనే జరిపించారు. నవల, వ్యాసం, ఉపన్యాసం, విమర్శ వంటి ప్రక్రియలకు ఆద్యులు. తెలుగులో వచ్చిన తొలి సాంఘిక నవల 'రాజశేఖర చరిత్ర' (1878) పంతులు గారు రాసిందే. సంఘసేవలో వీరేశలింగం ఎంత కృషి చేసారో, సాహిత్యంలోనూ అంతే కృషి జరిపారు. చదువుకునే రోజుల్లోనే రెండు శతకాలు రాసాడు. పత్రికలకు వ్యాసాలు రాస్తూ ఉండేవారు. వివేకవర్ధనిలో సులభశైలిలో రచనలు చేసేవారు. వ్యావహారిక భాషలో రచనలు చేసిన ప్రథమ రచయితలలో ఆయన ఒకరు. తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు భాషల్లో అద్వితీయ ప్రతిభ కలవారు కందుకూరి. ఆయన 130కి పైగా గ్రంథాలు రాసాడు. అన్ని గ్రంథాలు రాసిన వారు తెలుగులో అరుదు. సాంఘిక దురాచారాలను సంభాషణాత్మకంగా, వినోదాత్మకంగా విమర్శించే ప్రహసనాల వంటి ప్రయోగానికి వీరేశలింగమే ఆద్యుడు.ఆంధ్ర సమాజాన్ని సంస్కరణల బాట పట్టించిన సంస్కర్త, వీరేశలింగం 1919 మే 27 న మరణించారు. వీరేశలింగం గొప్ప సంస్కర్తే కాదు, గొప్ప కవి, రచయిత. తెలుగు సాహిత్యంలో ఆయన స్పృశించని సాహితీ ప్రక్రియ లేదు. ఆయన రచనలు, కవిత్వాల్లో కూడా అభ్యుదయ భావాలు నిండి ఉండేవి. తెలుగు సాహిత్యంలో ఆయనకు సమున్నతమైన స్థానం ఉంది. నవలలు, కథలు, వ్యాసాలు అన్ని రకాల సాహితీ ప్రక్రియల్లో వీరేశలింగం గారు తన దైన ముద్ర వేశారు. తెలుగు సాహిత్యం ఉన్నంత వరకూ వీరేశలింగం ఉంటారు. సంస్కరణోద్యమం ఉన్నంత వరకూ ఆయన పేరు చిరస్థాయిలో నిలుస్తుంది. ఆయన వ్యక్తి కాదు,గొప్ప వ్యవస్థ అనేది నూటికి నూరుపాళ్లు నిజం.

# భారతీయ పేదల నిశ్శబ్ద రుగ్మత

రక్తస్రావం, రక్తం గడ్డకట్టే (బ్లడ్ క్లాటింగ్) ప్రక్రియల లోపాలకు సంబంధించిన అనువంశిక రక్త రుగ్మతగా 'హీమోఫిలియా'ను గుర్తిస్తారు. ప్రపంచవ్యాప్తంగా 5 లక్షల మంది హీమోఫిలియాతో బాధ పడుతున్నారని అంచనా. హీమోఫిలియా రుగ్మతతతో బాధ పడే వ్యక్తులకు కోవిడ్-19 వ్యాధి పెద్ద సమస్యగా మారింది. సమాజంలో హీమోఫిలియా, ఇతర సంబంధిత వారసత్వ వ్యాధుల పట్ల సంపూర్ణ అవగాహన కల్పించాలనే సదుద్దేశంతో ప్రతి ఏటా 17 ఏప్రిల్ రోజున 'ప్రపంచ హీమోఫిలియా దినం' నిర్వహిస్తారు. ప్రపంచ హీమోఫిలియా దినం-2024 నినాదంగా 'అందరికి సమాన అందుబాటులో: రక్తస్రావ రుగ్మతలను గుర్తించడం (ఈక్విటబుల్ ఆక్సెస్ టు ఆల్: రికగ్నైజింగ్ ఆల్ బ్లీడింగ్ డిసార్డర్స్)' అనే సారాంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతోంది. 1969లో 'ప్రపంచ హీమోఫిలియా ఫెడరేషన్' సంస్థను స్థాపించిన 'ఫ్రాంక్ స్నాబెల్' పుట్టిన రోజు 17 ఏప్రిల్ సందర్భంగా ప్రపంచ హీమోఫిలియా దినాన్ని 1989 నుంచి పాటించుట ఆరంభమైంది. హీమోఫిలియా రుగ్మతల చికిత్సలో రక్త మార్పిడి చేయడానికి ఆస్కారం ఉంటుంది. హీమోఫిలియా రుగ్మత ఉన్నట్లు చాలా మందికి తెలియదు. కాబట్టి దీని పట్ల అవగాహన, అవసర వైద్య చికిత్సలు, తీసుకోవలసిన జాగ్రత్తలు తెలుసుకొని ఉండడం మంచిది. వైవిధ్యభరిత సమాజంలో కుటుంబాలు, పౌర సమాజం, సంరక్షకులు, ఫిజీషియన్స్, శాస్త్ర పరిశోధకులు అందరూ కరోనా కోరల్లో చిక్కడంతో హీమోఫిలియా రుగ్మతలతో పాటు ఇతర అనారోగ్యాలతో బాధ పడే రోగుల వైద్యం ప్రమాదంలో పడింది. హీమోఫిలియా రుగ్మతలకు కరోనా మహమ్మారి పెద్ద సవాళుగా నిలిచినా, 'అందరికీ వైద్యం' అనే సంకల్పంతో ముందుకు సాగడం జరుగుతున్నది. హీమోఫిలియా రుగ్మతతో బాధపడే వ్యక్తులకు చిన్న గాయం ఏర్పడినా రక్తం గడ్డకట్టడం మందగించి రక్తస్రావం కొనసాగి ప్రాణాపాయానికి దారి తీస్తుంది. రక్తం గడ్డకట్టే విధానాన్ని ఆధారంగా చేసుకొని హీమోఫిలియా రుగ్మత రెండు రకాలుగా ఉంటుంది. వీటినే హీమఫిలియా-ఏ, హీమోఫిలియా-బి అని పిలుస్తారు. అధికంగా కనిపించే హీమోఫిలియా-ఏ రుగ్మత దాదాపు ప్రతి 5,000లలో ఒకరికి, హీమోఫిలియా-బి రుగ్మత దాదాపు ప్రతి 20,000లలో ఒకరికి వస్తుందని గమనించారు. హీమోఫిలియాతో పాటు ఇతర రక్త సంబంధ వ్యాధులతో బాధ పడుతున్న 80 శాతం మందికి ఈ వ్యాధి ఉందని కూడా ఏమాత్రం తెలియదు.అనువంశికంగా సంక్రమించే హీమోఫిలియా వల్ల వ్యక్తికి గాయం అయినపుడు వెంటనే రక్తం గడ్డకట్టడం జరుగదు. దీని ఫలితంగా చిన్న/పెద్ద గాయానికి రక్తస్రావం అధికంగా జరిగి, ప్రమాదకరమైన ప్రాణాపాయ దుస్థితి వస్తుంది. కొన్ని సందర్భాలలో అంతర్గత రక్తస్రావంతో మెదడు, కీళ్ళలో రక్తస్రావం జరిగి ప్రాణాలు కూడా పోవచ్చు. హీమోఫిలియా రుగ్మత అంటువ్యాధి కాదు. కొందరిలో హీమోఫిలియా వలన రక్తస్రావం వారాలుగా కొనసాగవచ్చు. కీళ్ళు, కండరాల్లో రక్తస్రావం జరిగితే కీళ్ళ వాపు, కండరాల నొప్పి కనిపిస్తాయి. హీమోఫిలియా రుగ్మత అవగాహన నిమిత్తం లోగోలు, నినాదాలు, ఇతర కార్యక్రమాలు, కరపత్రాలు, ప్రచార సామాగ్రి, విద్యాలయాల్లో పోటీలు, సామాజిక మాధ్యమాల్లో దృశ్య శ్రవణ ప్రచారాలు పెద్ద ఎత్తున నిర్వహించాలి. జన్యులోపాలతో అనువంశికంగా సంక్రమించే హీమోఫిలియాకు ఎలాంటి సరైన చికిత్స అందుబాటులో లేదు. దీనిని నివారించుట కూడా సాధ్యపడదు. భారతదేశంలో దాదాపు 2 లక్షల హీమోఫిలియా రోగులు ఉన్నారని, వీరిలో 20,000 మంది మాత్రమే నమోదు చేయబడినారని తెలుస్తున్నది.

## ప్రేమ్ సింగ్ మహారాజ్ ఆశీర్వాదం తీసుకున్న ఎంపి అభ్యర్థి సుభాష్ రాథోడ్





**వాస్తవ నేస్తం,బజార్ హత్నూర్:** ఆదిలాబాద్ పార్లమెంట్ స్వతంత్ర ఎంపీ అభ్యర్థి సుభాష్ రాథోడ్ బజార్ హత్నూర్ మండలం కేంద్రంతో పాటు మండలంలోని భూతాయి తదితర గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. ముందుగా ప్రేమ్ సింగ్ మహారాజ్ ను కలిసి అయన ఆశీర్వాదం తీసుకున్నారు. మండలంలోని చాలా గ్రామాలకు రోడ్లు లేవని, ప్రజలు ఎన్నోసార్లు గెలిచినా ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లిన కూడా ఇప్పటివరకు సమస్య పరిష్కారం చేయకుండా ఏళ్లుగా కాలయాపనా చేశారని అన్నారు. ఇప్పుడు కూడా ఓట్ల సమయంలో తిరిగి మళ్ళా ఐదు సంవత్సరాలు కనిపియ్యరని అన్నారు. తన లాంటి యువ నాయకులకు ఒక అవకాశం ఇస్తే పట్టుదలతో అభివృద్ధి చేసి భవిష్యత్తులో మరిన్ని సార్లు గెలిచేందుకు అవకాశం కల్పించుకుంటానని అన్నారు. ప్రజల మద్దత్తు తనకుందని, ఒకసారి అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి ఓట్లు అడుగుతానాని అన్నారు. గతంలో గెలిచినా నాయకులు వైఫల్యం చెందిన తిరును ప్రజలకి వివరించారు. గత అనుభవాలు దృష్టిలో పెట్టుకొని ఓటు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భూతాయి నాయక్ గణేష్ , కార్ బారి వెంకట్ రావ్ రాథోడ్, చవాన్ గణపతి మహారాజ్, దత్త లాటే, శేష్ రావ్ లాంఢ్గే, రాథోడ్ రాజు, శంకర్ కుంబే వాడ్, అనిల్ రాథోడ్ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం చేసిన ఉపాధ్యాయురాలు



**వాస్తవ నేస్తం,బోనకల్:** ఖమ్మంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా టీఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆది వారం నిర్వహించినటువంటి రక్తదాన శిబిరంలో ఉపాధ్యాయురాలు పాల్గొని ప్రమీల రక్తదానం చేశారు. జడ్పీహెచ్ఎస్ బోనకల్ మండల పరిధిలోని రావినూతల ప్రధానోపాధ్యాయులు ,ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలు యువతకు ఎంతో స్ఫూర్తిదాయకం అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి వల్లంకొండ రాంబాబు, రమేషు టీచర్స్ దుర్గాభవాని నాగమల్ల కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## వణ్య ప్రాణులకు దాహార్తి తీర్చుటకు నీటి సాసర్ల ఏర్పాటు



**వాస్తవ నేస్తం ఏర్గట్ల:** మండల కేంద్రంలో గల భీమన్న గుట్ట తో పాటు ప్రక్కన ఉన్న గుట్ట లో వణ్య ప్రాణులకు దాహార్తి తీర్చడానికి ఐదు నీటి సాసర్లు ఏర్పాటు చేసి సాసర్లల్లో వన్య ప్రాణులు త్రాగడానికి నీటి సౌకర్యం కల్పించినట్లు కమ్మార్ పల్లి రేంజ్ ఫారెస్ట్ అధికారి రాథోడ్ తుకారాం తెలిపారు. ప్రతి ఒక్కరూ పక్షుల దాహార్తి తీర్చడం కోసం పరిసరాలలో నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలన్నారు. తనతో పాటు బిట్ అధికారి లింగన్న పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

## కనకాపూర్'లో అంగన్వాడీ కేంద్రంలో ఈసీసీఈ డే



**వాస్తవ నేస్తం,లోకేశ్వరం:** మండలంలోని కనకాపూర్ ఒకటవ అంగన్వాడీ కేంద్రంలో సోమవారం ఘనంగా(ఈసీసీఈ)ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ డే ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ ప్రభ మాట్లాడుతూ... పిల్లల శారీరక,మేదో వికాసము,భాష, నేర్చుకునే రీతులు,బడికి సంసిద్ధత వంటి అభివృద్ధి అంశాలపై తల్లులకు అవగాహన కల్పిస్తూ వారి పిల్లలు అభివృద్ధి పరిధిలోని అంశాలను ఎంతవరకు చేరుకోగలిగారు అని వివరిస్తూ సంబంధిత అభివృద్ధి కార్డును తల్లులకు అందించారు. అంగన్వాడి కేంద్రంలో ఆడుతున్న ఆటలు చదువు గురించి తెలియజేశారు, ప్రీస్కూల్ పిల్లలకు ప్రతి రోజు అంగన్వాడి కేంద్రానికి పంపించాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రీస్కూల్ పిల్లలు,వారి తల్లులు పాల్గొన్నారు.

## మరోసారి మోదీని ప్రధానమంత్రి చేయాలి



**వాస్తవ నేస్తం,బాసర:** మండల కేంద్రంలో ని మైలాపూర్ గ్రామంలో వికాస్ భారత్ మన సంకల్పం ఆప్ కీ బార్ కార్యక్రమాన్ని మండల బీజేపీ నాయకులు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీలో పర్యటిస్తూ నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. రాబోవు ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి మరోసారి నరేంద్ర మోదీని ప్రధానమంత్రిని చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పోలింగ్ బూత్ అధ్యక్షుడు అన్నెల రాజేశ్వర, సీనియర్ నాయకులు,మమ్మాయి గంగాధర్,మమ్మాయి పిరాజి,అంతగిరి పోతన్న,పోగుల పిరాజి,బలగం రామ్మోహన్,గ్రామస్తులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈనెల 25 నుండి ఓపెన్ పదవ తరగతి ఇంటర్ పరీక్షలు

- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- తాసిల్దార్ లు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయాలి
- అధికారులతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సమీక్ష




**వాస్తవ నేస్తం,సంగారెడ్డి:** ఈనెల 25వ తేదీ నుండి జరగనున్న ఓపెన్ పదవ తరగతి ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో విద్యాశాఖ అధికారులతో ఓపెన్ ఇంటర్, పదవ తరగతి పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. ఈనెల 25 నుండి వచ్చే నెల రెండవ తేదీ వరకు థియరీ పరీక్షలు వచ్చే నెల మూడో తేదీ నుండి పదవ తేదీ వరకు ప్రాక్టికల్ ఎగ్జామ్స్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని ఓపెన్ 10వ తరగతి ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. పదవ తరగతిలో 2388 మంది విద్యార్థులు, ఇంటర్ పరీక్షలకు 4297 మంది, విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఆయా మండలాలలోని ఓపెన్ ఇంటర్ ఓపెన్ 10వ తరగతి పరీక్షా కేంద్రాలను ఆయా మండలాల ఎమ్మార్వోలు విధిగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఫ్లైయింగ్ స్క్వాడ్ , సెట్టింగ్స్ స్క్వాడ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ ఆదేశాల మేరకు అదనపు విధులు నిర్వహించాలన్నారు. ఓపెన్ పరీక్షలకు పెద్దలు,గర్భిణీ స్త్రీలు, చంటి పిల్లల తల్లులు వికలాంగులు హాజరవుతారు, వారికి గ్రౌండ్ ఫ్లోర్ లోనే పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. వేసవికాలం ఎండలను దృష్టిలో పెట్టుకొని అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాలలో తాగునీటి వసతి, టెంట్లు ఏర్పాటు చేయాలని,అధికారులను ఆదేశించారు. పరీక్షలు ప్రతి ఒకరోజు ఉదయం 9:30 నుంచి 12:30 వరకు మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి ఐదు గంటల వరకు జరగనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఓపెన్ 10వ తరగతి, ఇంటర్ పరీక్షలు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పద్మజా రాణి, విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు, సంబంధిత శాఖాధికారులు పాల్గొన్నారు.

## 18న మద్నూర్ మండల సర్వసభ్య సమావేశం



**వాస్తవ నేస్తం,జుక్కల్(ఆర్ సి):** నియోజకవర్గంలోని మద్నూర్ మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 18న గురువారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వాగ్మారే లక్ష్మీబాయి అధ్యక్షతన జరుగుతుందని, మండల పరిషత్ అభివృద్ధి అధికారి పరుచూరి రాణి తెలిపారు. సర్వసభ్య సమావేశానికి మండల ప్రాదేశిక సభ్యులు, సంబంధిత శాఖల మండల అధికారులు సమావేశానికి సకాలంలో హాజరవ్వాలని ఎంపీడీవో కోరారు.

## కాంగ్రెస్ పార్టీ మైనారిటీ రాష్ట్ర ఉపాధ్యక్షునికి ఘన సన్మానం



**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** కాంగ్రెస్ పార్టీ అయినారటి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సైఫ్ఉల్లను బోథ్ నియోజకవర్గ మైనార్టీ అబ్జర్వర్ సద్దాం హుస్సేన్ మర్యాదపూర్వకంగా కలిసి ఉషారువాతో సన్మానించారు. తనను బోథ్ నియోజక వర్గ మైనార్టీ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అబ్జర్వర్ గా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం పని చేస్తామ. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శప్రాయుడు సీనియర్ ఫోటోగ్రాఫర్ గుండు రవి



**వాస్తవ నేస్తం,కోదాడ:** పట్టణానికి చెందిన సీనియర్ ఫోటోగ్రాఫర్ గుండు. రవి సంతాప కార్యక్రమాన్ని కోదాడ పట్టణంలోని స్థానిక వర్తక సంఘం భవనంలో కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా కోదాడ పట్టణ ఫోటోగ్రాఫర్లు వెళ్లి రవి చిత్రపటం వద్ద రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తాను నవ్వుతూ అందరినీ నవ్విస్తూ సరదాగా కళ్ళ ముందు రోజు తిరిగే రవి తిరిగిరాని లోకాలకు వెళ్లినందుకు ఫోటోగ్రాఫర్లు కన్నీళ్ళతో బాధ తప్త హృదయాలతో జోహార్లు గుండు రవి అంటూ శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పిల్లుట్ల వెంకట్, మరికంటి లక్ష్మణ్, జాతీయస్థాయి ఫోటోగ్రాఫర్ బొమ్మల వెంకన్న, సీనియర్ ఫోటోగ్రాఫర్లు బసవయ్య, సప్తగిరి, మయూరి, రామకృష్ణారెడ్డి, నరసింహా, శేషు,ప్రభాకర్, శ్రీను, నరేందర్,నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్

**- తృటిలో తప్పిన పెను ప్రమాదం**



**వాస్తవ నేస్తం,జుక్కల్(ఆర్.సి):** డోంగ్లి మండల కేంద్రంలోని ఎనబుర, కుర్ల గ్రామ శివారులో రోడ్డు ప్రక్కన గల ట్రాన్స్ఫర్మర్ను సోమవారం రోజున ఉదయం నిర్లక్ష్యంగా ట్రాక్టర్ నడపడంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొని ట్రాక్టర్ బోల్తా పడడంతో స్తంభాలు విరిగిపోయి ట్రాన్స్ఫారం కింద పడిపోవడం జరిగింది. కాగా ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు, ప్రాణపాయం జరగలేదని, వెంటనే మరమ్మతులు చేపడుతున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

# కొలెస్ట్రాల్ సమస్యని సూపర్ ఫుడ్స్



కొలెస్ట్రాల్ సమస్యతో బాధపడే వారు పొద్దుతిరుగుడు గింజలను తీసుకోవడం వల్ల కూడా మంచి ఫలితం ఉంటుంది. వీటిలో విటమిన్ ఇ తో పాటు మోనోశాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో ఇవి ఎంతో సహాయపడతాయి. నల్ల నువ్వులను తీసుకోవడం వల్ల కూడా చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. వీటిని తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు క్యాన్సర్ ముప్పు కూడా తగ్గుతుంది.జనపనార విత్తనాలను తీసుకోవడం వల్ల కూడా మంచి ఫలితం ఉంటుంది. వీటిలో ప్రోటీన్ తో పాటు గామా లినోలెనిక్ యాసిడ్ ఉంటుంది. కొలెస్ట్రాల్ ను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇవి చక్కగా పని చేస్తాయి. కొలెస్ట్రాల్ ను తగ్గించడంలో గుమ్మడి గింజలు కూడా చక్కగా పని చేస్తాయి. ఈ గింజలల్లో ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్లు, మోనోశాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి.కొలెస్ట్రాల్ ను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇవి ఎంతో సహాయపడతాయి. నువ్వులకు కూడా కొలెస్ట్రాల్ ను తగ్గించే గుణం ఉంది. వీటిలో యాంటీ ఇన్ ప్లామేటరీ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. మంట, ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడంలో కొలెస్ట్రాల్ ను తగ్గించడంలో ఇవి సహాయపడతాయి.కొలెస్ట్రాల్ ను తగ్గించడంతో పాటు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో అవిసె గింజలు మనకు ఎంతగానో సహాయపడతాయి. వీటిని లిన్సీడ్స్ అని కూడా అంటారు. ఈ గింజలల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఎక్కువగా ఉంటాయి. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇవిమనకు ఎంతో సహాయపడతాయి. కొలెస్ట్రాల్ సమస్యను తగ్గించడంలో చియా విత్తనాలు కూడా ఎంతో దోహదపడతాయి. వీటిలో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. చెడుకొలెస్ట్రాల్ ను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇవి ఎంతో దోహదపడతాయి.గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ఆహారాలను తీసుకోవాలి. కొలెస్ట్రాల్ ను తగ్గించడంతో పాటు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఈ విత్తనాలు మనకు ఎంతగానో సహాయపడతాయి. ఈ విత్తనాల్లో ఫైబర్ తో పాటు శరీరానికి అవసరమయ్యే ఎన్నో పోషకాలు ఉన్నాయి. వీటిని తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ సమస్య నుండి చాలా సులభంగా బయటపడవచ్చు.

# పాలలో ఇది కలిపి తాగితే చాలా ఆరోగ్యంగా ఉంటారు?

ఇసాబ్గోల్ ను పాలలో కలిపి తీసుకోవడం వల్ల శరీరం శుభ్రపడుతుంది. శరీరంలో డిటాక్సిఫికేషన్ ప్రక్రియను మెరుగుపరచడంలో ఇసాబ్గోల్ మనకు సహాయపడుతుంది. ఇసాబ్గోల్ ను తీసుకోవడం వల్ల ప్రేగుల్లో మంచి బ్యాక్టీరియా శాతం పెరుగుతుంది.దీనిని పాలతో కలిపి తీసుకోవడం వల్ల చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. చర్మం సహజంగా ప్రకాశవంతంగా తయారవుతుంది. అలాగే ఇసాబ్గోల్ ను తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అంటువ్యాధులు, ఇన్ఫెక్షన్ లు మన దరి చేరకుండా ఉంటాయి. ఇసాబ్గోల్ ను తీసు కోవడం వల్ల ఇరిటెబుల్ బౌల్ సిండ్రోమ్ సమస్య నుండి ఉపశమనం కలుగుతుంది. ఈ సమస్య వల్ల కలిగే పొత్తి కడుపులో నొప్పి, ఉబ్బరం వంటి సమస్యలు కూడా తగ్గుతాయి. అలాగే చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడంలో కూడా ఇసాబ్గోల్ మనకు సహాయపడుతుంది. పాలతో కలిపి దీనిని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. బరువును అదుపులో ఉంచడంలో కూడా ఇసాబ్గోల్ మనకు సహాయపడుతుంది. దీనిని పాలతో కలిపి తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. త్వరగా ఆకలి వేయకుండా ఉంటుంది.త్వరగా మనం తీసుకునే క్యాలరీల సంఖ్య తగ్గుతుంది. దీంతో మనం సులభంగా బరువు తగ్గవచ్చు.ఇసాబ్గోల్ ను తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు అదుపులో ఉంటాయి. రక్తపోటు అదుపులో ఉంటుంది. హృదయ సంబంధిత సమస్యలు రాకుండా ఉంటాయి. పాలతో కలిపి తీసుకోవడం వల్ల చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. చర్మం సహజంగా ప్రకాశవంతంగా తయారవుతుంది. అలాగే ఇసాబ్గోల్ ను తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అంటువ్యాధులు, ఇన్ఫెక్షన్ లు మన దరి చేరకుండా ఉంటాయి.ఇసాబ్గోల్ ను పాలతో కలిపి తీసుకోవడం వల్ల కడుపులో యాసిడ్ ఎక్కువగా ఉండడం వల్ల వచ్చే సమస్యల నుండి ఉపశమనం కలుగుతుంది.



# వేడి నీటిని తాగితే కలిగే లాభాలు



వేడి నీటిని తీసుకోవడం వల్ల కలిగే అనేక ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. ప్రతి రోజూ వేడి నీటిని తీసుకోవడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి.వేడి నీరు కండరాలు రిలీఫ్ అయ్యేలా చేస్తుంది. ఆర్థరైటిస్, కండరాల ఒత్తిడి వంటి పరిస్థితులతో సంబంధం ఉన్న నొప్పిని తగ్గించడంలో సాయపడుతుంది. ప్రభావిత ప్రాంతాలకు రక్త ప్రవాహాన్ని ప్రసరించేలా చేస్తుంది. వాపును తగ్గిస్తుంది.వేడి నీటిని తాగడం వలన ఆకలిని అణిచివేస్తుంది. బరువు తగ్గించడంలో వేడి నీరు సాయపడుతుంది. అదనంగా, శరీరంలో కొవ్వు నిల్వలను విచ్ఛిన్నం చేయడంలో సాయపడుతుంది. బరువు తగ్గడాన్ని సులభతరం చేస్తుంది.వేడి నీరు రక్త నాళాలను విస్తరించడంలో సాయపడుతుంది. శరీరం అంతటా రక్త ప్రసరణను మెరుగుపరిచేలా చేస్తుంది. కణాలకు మెరుగైన ఆక్సిజన్, పోషకాల పంపిణీని అందిస్తుంది. అలాగే కణజాలాల నుంచి వ్యర్థాల తొలగింపుకు దారితీస్తుంది.తేనె, నిమ్మకాయతో కూడిన వేడి నీరు మంట, చికాకును తగ్గించడంలో సాయపడుతుంది. తద్వారా గొంతు నొప్పిని తగ్గిస్తుంది. గొంతును తేమగా ఉంచడంలో సాయపడుతుంది. అసౌకర్యం నుంచి ఉపశమనం అందిస్తుంది.వేడి నీరు ఆహార కణాల విచ్ఛిన్నం చేసి జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. జీర్ణవ్యవస్థ ద్వారా ఆహారం కదలికను ప్రోత్సహిస్తుంది. కడుపు కండరాలను విశ్రాంతి, ఉపశమనాన్ని కలిగిస్తుంది. మెరుగైన జీర్ణక్రియను ప్రోత్సహిస్తుంది. ఉబ్బరం, మలబద్ధకం వంటి సమస్యలను తగ్గిస్తుంది.అయితే విపరీతమైన వేడి నీరు మాత్రం అస్సలు తాగకూడదు. నోటి, అన్నవాహిక సున్నితమైన కణజాలాలకు నష్టాన్ని కలిగిస్తుంది.
వేడి నీటిని తాగడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. మీ వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలి. క్రమం తప్పకుండా వేడి నీటిని తాగడంతో పాటు సమతుల్య ఆహారం, ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాట్లను కలిగి ఉండాలి. శ్రేయస్సుకు దోహదం చేస్తుంది.వేడి నీటిలో నిమ్మకాయ, తేనె, అల్లం లేదా మూలికలు వంటి పదార్థాలను కలిపితే ఎంతో రుచిని మెరుగుపరుస్తుంది. అదనపు ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# అతి నిద్రతో భయంకరమైన నష్టాలు



అతి నిద్ర ఆరోగ్యానికి అస్సలు మంచిది కాదు. మీరు 9 గంటల కంటే ఎక్కువ నిద్రపోతే ఇది సాధారణమైనది కాదని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఇది ఆందోళన కలిగించే విషయంగా చెబుతున్నారు..ఇది నిద్ర రుగ్మత లేదా ఏదైనా ఇతర అనారోగ్య సమస్య కావొచ్చునని అంటున్నారు. డిప్రెషన్, మానసిక సమస్యలు, గుండె అసాధారణ రీతిలో కొట్టుకోవడం తదితర లక్షణాలు కనిపిస్తాయి. ఆలస్యంగా నిద్రపోవడం వల్ల ఊబకాయం, మధుమేహం, రెస్ట్‌లెస్ లెగ్ సిండ్రోమ్, క్రానిక్ పెయిన్, స్లీప్ అప్నియా, నిద్రలేమి, హైపోథైరాయిడిజం, డిప్రెషన్ లేదా యాంగ్జయిటీ, కార్డియోవాస్క్యులార్ డిసీజ్ వంటి నిద్ర రుగ్మతలు వచ్చే ప్రమాదం ఉంది.8 గంటల కన్నా ఎక్కువ సమయం నిద్రపోయే వారిలో బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే ముప్పు అధికంగా ఉంటుందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. అతిగా నిద్రపోవటం వల్ల బరువు పెరుగుతారు. తలనొప్పి, వెన్ను నొప్పి వంటి సమస్యలు వస్తాయి. గుండె జబ్బులు, డయాబెటిస్ వచ్చేందుకు అవకాశం ఉంటుంది. శరీరం కొవ్వును ఎక్కువగా నిల్వ చేసుకుంటుంది. ఫలితంగా గుండె సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. అతిగా నిద్ర పోయే వారిలో డిప్రెషన్, తీవ్రమైన తలనొప్పి వంటి సమస్యలు వస్తాయంటున్నారు. అతిగా నిద్రపోయే వారిలో వృద్ధాప్య లక్షణాలు త్వరగా కనిపిస్తాయి. అంతేకాదు.. అతిగా నిద్రపోయేవారు విపరీతమైన అలసటను అనుభవిస్తారు. ఏ పనీ చేయబుద్ధి కాదు. చిన్న పని చేసినా అలసిపోతుంటారని నిపుణులు చెబుతున్నారు.7-8 గంటలు నిద్రపోవడం చాలా ముఖ్యం. ఇది మిమ్మల్ని శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంచుతుంది. సరైన నిద్ర అనంతరం మేల్కొన్నప్పుడు, మీరు చాలా రిలాక్స్‌గా ఉంటారు. రోజంతా హాయిగా గడిచిపోతుంది.

# క్యాన్సర్‌ను అడ్డుకొనే సపోటా!

మనకు దొరికేటువంటి పండ్ల లో సపోటా పండు కూడా ఒకటి. ఈ సపోట ను తినడం వల్ల ఎన్నో రకాల ఉపయోగాలు ఉన్నాయి. ముఖ్యంగా జీర్ణ క్రియను మెరుగుపరచడమే కాకుండా ఎలాంటి పొట్ట నైన తగ్గించే గుణం ఉన్నది.సపోటా పండులో ముఖ్యంగా విటమిన్స్ పొటాషియం వంటివి పుష్కలంగా లభిస్తాయి .సపోటా పండును రోజుకొకటి ఆహారంలో చేర్చుకోవడం వల్ల జీర్ణ క్రియ కూడా పెరుగు పడుతుంది. శరీరంలో ఉండేటువంటి అదనపు కేలరీలను సైతం కరిగించేలా చేస్తుంది. సపోటాలు కాస్త చెక్కెర గుణం ఎక్కువగానే ఉంటుంది.సపోటా కాయలో ఉండేటువంటి పోషకాలు జీర్ణా క్రియ క్యాన్సర్ ను అడ్డుకోవడంలో చాలా ఉపయోగపడుతుంది.. సపోటాలు తింటే శరీరానికి గ్లూకోజ్ బాగా లభిస్తుంది. ఇందులో ఉండేటువంటి ఫైబర్ వల్ల మలబద్ధక సమస్యను కూడా పరిష్కరిస్తుంది. సపోటా తినడం వల్ల తరచూ ఆకలి అనేది వేయదట. సపోటాలో ఉండేటువంటి విటమిన్స్ వల్ల శరీరంలో రోగ నిరోధక శక్తి కూడా పెరుగుతుంది. అలాగే ఎముకలని కూడా బలపరచడానికి సపోటా కాయలు చాలా ఉపయోగపడతాయి. కిడ్నీలోని రాళ్ళను ఏర్పడకుండా చేయడానికి సపోటా చాలా ఉపయోగపడుతుంది.. జట్టు రాలడం చుండ్రు వంటి సమస్యను కూడా తగ్గించడానికి ఈ సపోటా ఎక్కువగా ఉపయోగపడుతుందట. కడుపు సంబంధిత సమస్యలు ఉన్నవారు సపోటాను తినడం వల్ల మంచి ఉపయోగం ఉంటుంది. ఇతర పండ్లతో పోలిస్తే సపోటాలో తక్కువ క్యాలరీలు ఉండడం వల్ల చాలా మేలు జరుగుతుంది. అయితే సపోటా తినడానికి రుచిగా అనిపిస్తుంది. అయితే మధుమేహ వ్యాధి గ్రహస్తులు సైతం ఈ పండుని తినకపోవడమే మంచిదంటూ వైద్యులు సైతం తెలియజేస్తూ ఉంటారు. సపోటాలో ఉండేటువంటి విటమిన్ ఏ వల్ల కంటి సమస్యలను సైతం దూరం చేస్తుందట. ఎవరైనా నిద్రలేని సమస్యతో ఒత్తిడితో ఇబ్బంది పడేవారు సపోటా జ్యూస్ తాగడం వల్ల మంచి ఉపయోగం ఉంటుంది. ప్రతిరోజు ఒక సపోటా తినడం వల్ల స్లిమ్ముగా మారుతారట.



http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



స్థానిక వార్తలు

# అదానీ స్టాక్స్‌లో ఎల్ఐసీ పెట్టుబడులు

## బోర్న్‌వీటా హెల్త్‌డ్రింక్ కాదు!




**న్యూఢిల్లీ :** బోర్న్‌వీటాను తయారు చేస్తున్న మోండెలెజ్ ఇండియా ఫుడ్స్‌కు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ భారీ షాక్ ఇచ్చింది. బోర్న్‌వీటా హెల్త్ డ్రింక్ కాదని స్పష్టం చేసింది. ఈ విషయమై ఆ సంస్థ సహా, ఇ కామర్స్ కంపెనీలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. బోర్న్‌విటా సహా ఇతర పానియాలను హెల్త్ డ్రింక్స్' కేటగిరీ నుంచి తొలగించాలని ఇకామర్స్ వేదికలకు కేంద్రం ఏప్రిల్ 10న జారీ చేసిన నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. పిల్లల హక్కుల పరిరక్షణ చట్టం 2005 సెక్షన్ 3 ప్రకారం దేశంలోని ఆహార చట్టాలలో 'హెల్త్ డ్రింక్' అని ఎక్కుడా వినియోగించకూడదని రెగ్యులేటరీ బాడీ తెలిపింది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ చట్టం 2006లో హెల్త్ డ్రింక్ అని దేన్నీ నిర్వచించలేదు. ఈ క్రమంలోనే బోర్న్‌వీటా సహా అన్ని పానియాలను హెల్త్ డ్రింక్స్ కేటగిరీ నుంచి తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఐ)కి సమర్పించిన నియమాలు, నిబంధనల్లో బోర్న్‌వీటాను హెల్త్ డ్రింక్‌గా నమోదు చేసినట్లు వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇకపై హెల్త్ డ్రింక్ పేరుతో అమ్మకాలు నిర్వహిస్తే సదరు కంపెనీలపై చర్యలుంటాయని తెలిపింది.

## భారత్‌లోకి ఎలన్ మస్క్ ఇంటర్నెట్ కంపెనీ!




**న్యూఢిల్లీ :** ఎలన్ మస్క్‌కు చెందిన శాటిలైట్ ఇంటర్నెట్ సేవల సంస్థ స్టార్‌లింక్ భారత్‌లో ప్రవేశానికి ప్రయత్నిస్తోందని సమాచారం. టెస్లా కంపెనీ ప్రవేశానికి అనుకూలంగా ఇటీవల కేంద్రం విద్యుత్ వాహనాల పాలసీని రూపొందించిన విషయం తెలిసిందే. ఇక్కడ ప్లాంట్ పెట్టడానికి టెస్లా అధినేత ఎలన్ మస్క్ ఏప్రిల్ 21న భారత్‌కు రానున్నారు. టెస్లా ప్లాంట్ సహా స్టార్‌లింక్ అంశమై అధికారులతో చర్చించనున్నారు. శాటిలైట్ ఇంటర్నెట్ యూనిట్‌కు సంబంధించి లైసెన్స్ ప్రక్రియ ఇప్పటికే టెలికమ్యూనికేషన్స్ విభాగం(డిఒటి) పరిశీలనలో ఉంది. ఇటీవల శాటిలైట్ కమ్యూనికేషన్ సేవల కోసం లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్ఒఐ), ట్రయల్ స్పెక్ట్రమ్‌పై పని చేసేందుకు డిఒటి అనుమతులు కూడా ఇచ్చింది. స్టార్‌లింక్‌కు అనుమతులిస్తే.. ఎయిర్‌టెల్, జియోకు గట్టి పోటీ ఎదురు కానుంది. ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ సైతం శాటిలైట్ ఇంటర్నెట్ సేవల కోసం దరఖాస్తు చేసుకుంది.

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ బీమా సంస్థ 'లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా'కు అదానీ గ్రూప్‌లో ఉన్న పెట్టుబడుల విలువ గత ఆర్థిక సంవత్సరంలో 59 శాతం పుంజుకుంది. అమెరికన్ షార్ట్‌సెల్లర్ హిండెన్‌బర్గ్ ఆరోపణల తర్వాత అదానీ గ్రూప్ నమోదిత కంపెనీల షేర్ల విలువ భారీగా పతనమైన విషయం తెలిసిందే. ఫలితంగా ఎల్ఐసీ రాబడి సైతం అదే స్థాయిలో కుంగింది. ఎట్టకేలకు ఆయా కంపెనీల షేర్లు తిరిగి పుంజుకోవటంతో ఎల్ఐసీ పెట్టుబడులకు 2023-24లో మంచి ప్రతిఫలాలు దక్కాయి.అదానీ గ్రూప్ సంస్థల్లో ఎల్ఐసీ పెట్టుబడుల విలువ 2023 మార్చి 31 నాటికి రూ.38,471 కోట్లుగా ఉంది. స్టాక్ ఎక్స్ఛేంజీల డేటా ప్రకారం.. 2024 మార్చి 31 నాటికి అది రూ.61,210 కోట్లకు పెరిగింది. హిండెన్‌బర్గ్ నివేదిక తర్వాత అదానీ గ్రూప్‌పై అనేక ఆరోపణలు వచ్చిన విషయం తెలిపిందే. దీంతో ఆ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టాలన్న ఎల్ఐసీ నిర్ణయంపైనా అనేక అనుమానాలు తలెత్తాయి. ఫలితంగా పలు నియంత్రణా సంస్థలు దీనిపై తనిఖీలు నిర్వహించాయి. తీవ్ర విమర్శల నేపథ్యంలో అదానీ గ్రూప్‌నకు చెందిన రెండు కీలక కంపెనీలైన అదానీ పోర్ట్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్ నుంచి ఎల్ఐసీ కొంతమేర పెట్టుబడులను తగ్గించుకుంది. ఆ రెండు కంపెనీల షేర్లు వరుసగా గత ఆర్థిక సంవత్సరంలో 83 శాతం, 68.4 శాతం పుంజుకోవడం గమనార్హం. అయినప్పటికీ.. మిగిలిన సంస్థల్లోని ఎల్ఐసీ పెట్టుబడులు 59 శాతం పుంజుకుంది. మరోవైపు అదానీ షేర్లు కుంగిన




సమయంలో విదేశీ ఇన్వెస్టర్లయిన ఖతార్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ, అబుదాబి ఐహెచ్‌సీ, ఫ్రాన్స్ టోటల్‌ఎనర్జీస్, అమెరికా జీక్యూజీ ఇన్వెస్ట్‌మెంట్ కలిపి దాదాపు రూ.45,000 కోట్లు పెట్టుబడిగా పెట్టాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్‌లోని ఎల్ఐసీ పెట్టుబడుల విలువ వార్షిక ప్రాతిపదికన రూ.8,495.31 కోట్ల నుంచి రూ.14,305 కోట్లకు చేరింది. అదానీ పోర్ట్స్ విషయంలో ఈ మొత్తం రూ.12,450.09 కోట్ల నుంచి రూ.22,776.89 కోట్లకు పెరిగింది. అదానీ గ్రీన్ విలువ ఏడాదిలోనే రెండింతలు పెరిగి రూ.3,937.62 కోట్లకు ఎగబాకింది. ఇదే తరహాలో అదానీ టోటల్ గ్యాస్, అంబుజా సిమెంట్స్, ఏసీసీ పెట్టుబడులు సైతం పుంజుకున్నాయి.

# నెట్‌ఫ్లిక్స్‌కు రికార్డ్ లాభాలు!

ప్రముఖ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ తీసుకున్న ఒక్క కఠిన నిర్ణయంతో దాని లాభాలు అమాంతం పెరగనున్నాయి. 'వన్ డే' పాపులర్ షో విడుదల, పాస్‌వర్డ్ షేరింగ్ కట్టడి చర్యల తర్వాత నెట్‌ఫ్లిక్స్ లాభాలు కొత్త రికార్డును తాకనున్నాయి.వాల్ స్ట్రీట్ అంచనాల ప్రకారం.. ఈ స్ట్రీమింగ్ దిగ్గజం ఈ సంవత్సరంలో మొదటి మూడు నెలల్లో 4.7 మిలియన్ల మంది సబ్‌స్క్రైబర్‌లను సాధించింది. 2020 కోవిడ్ లాక్‌డౌన్‌ల తర్వాత సబ్‌స్క్రైబర్‌ల సంఖ్య పెరుగుదల ఇదే అత్యధికం. అయితే నెట్‌ఫ్లిక్స్ ఈ స్థాయిలో పుంజుకోవడానికి పాస్‌వర్డ్ షేరింగ్‌ను కట్టడి చేయడమే కారణంగా తెలుస్తోంది.అయితే 2022లో ప్రకటనలతో కూడిన చౌకైన నెలవారీ చెల్లింపు ప్లాన్‌ను ప్రవేశపెట్టినప్పటి నుండి నెట్‌ఫ్లిక్స్‌కు యూజర్ల సంఖ్య పెరిగింది. రీఫినిటివ్ డేటా ప్రకారం.. నెట్‌ఫ్లిక్స్ లాభాలు 50 శాతం కంటే ఎక్కువ పెరిగి దాదాపు రూ. 16 వేల కోట్లకు చేరుకోవచ్చని అంచనా. కంపెనీకి సంబంధించి ఏ ఆర్థిక సంవత్సరంలోనైనా మొదటి త్రైమాసికంలో ఇవే అత్యధిక లాభాలు కానున్నాయి. ఇది డిస్నీ, అమెజాన్, యాపిల్ వంటి దిగ్గజాలతో స్ట్రీమింగ్ వార్‌లో నెట్‌ఫ్లిక్స్‌ను దృఢంగా




నెలబెట్టనుంది. నెట్‌ఫ్లిక్స్ ప్రపంచవ్యాప్తంగా 26 కోట్ల మంది వినియోగదారులను కలిగి ఉంది. అమెజాన్ ప్రైమ్‌కు 20 కోట్ల మంది, డిస్నీంకి 15 కోట్ల మంది యూజర్లు ఉన్నారు.

స్పోర్ట్స్

# మేజర్ లీగ్ క్రికెట్‌లో సన్‌రైజర్స్ స్టార్ ప్లేయర్

అమెరికా వేదికగా జరిగే మేజర్ లీగ్ క్రికెట్ బరిలో మరో ఆస్ట్రేలియా ఆటగాడు నిలిచాడు. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్‌కు హైదరాబాద్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న ట్రవిస్ హెడ్ వాషింగ్టన్ ఫ్రీడం ఫ్రాంచైజీతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ ఫ్రాంచైజీకి ఇదివరకే చాలా మంది ఆసీస్ ఆటగాళ్లు ప్రాతినిథ్యం వహిస్తున్నారు. ఆసీస్ లిమిటెడ్ ఓవర్స్ స్పెషలిస్ట్ మోసస్ హెన్రిక్స్ ఈ జట్టుకు సారధ్యం వహిస్తుండగా.. స్టీవ్ స్మిత్, తన్వీర్ సంగా, బెన్ ద్వార్షుయిస్, జోష్ ఫిలిప్ లాంటి ఆసీస్ ప్లేయర్స్ ఆటగాళ్లుగా బరిలోకి దిగనున్నారు.

వాషింగ్టన్ ఫ్రీడంతో ఇటీవలే ఆసీస్ దిగ్గజం రికీ పాంటింగ్ కూడా ఒప్పందం కుదుర్చుకున్నాడు. పాంటింగ్ ఎంఎల్‌సీ తదుపరి సీజన్ నుంచి ఈ ఫ్రాంచైజీకి హెడ్ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. ఈ ఆసీస్ ఆటగాళ్లంతా కలిసి జులై 4 నుంచి ప్రారంభంకాబోయే ఎంఎల్‌సీ సెకెండ్ ఎడిషన్‌లో వాషింగ్టన్ ఫ్రీడంకు ప్రాతినిథ్యం వహిస్తారు. వీరితో పాటు మరో ముగ్గురు ఆసీస్ ఆటగాళ్లు ఎంఎల్‌సీలో వేర్వేరు ఫ్రాంచైజీలకు ఆడనున్నారు. ఆడమ్ జంపా, స్పెన్సర్ జాన్సన్ లాస్ ఏంజెల్స్ నైట్‌రైడర్స్‌కు.. టిమ్ డేవిడ్ ముంబై ఇండియన్స్ న్యూయార్క్‌కు ప్రాతినిథ్యం వహించనున్నారు. మేజర్ లీగ్ టీ20 వరల్డ్ కప్ ముగిసిన వెంటనే ప్రారంభమవుతుంది. ఈ లీగ్‌లో ఆసీస్ ఆటగాళ్లే కాక చాలామంది విదేశీ ఆటగాళ్లు పాల్గొననున్నారు. న్యూజిలాండ్



ఆటగాడు రచిన్ రవీంద్ర కూడా కొత్తగా వాషింగ్టన్ ఫ్రీడంతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తుంది. సౌతాఫ్రికా మార్కో జన్సెన్, వెస్టిండీస్ అకీల్ హొసేన్‌ను వాషింగ్టన్ ఫ్రీడం తిరిగి రీటైన్ చేస్తున్నట్లు సమాచారం. ఆటగాళ్లకు సంబంధించిన పూర్తి సమాచారం త్వరలో వెల్లడికానుంది.

## హార్దిక్ పాండ్యా బౌలింగ్, కెప్టెన్సీ సరిగాలేదు




**ముంబై:** ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ జట్టు కెప్టెన్ హార్దిక్ పాండ్యాపై ఇటీవల తీవ్ర విమర్శలు వస్తున్న విషయం తెలిసిందే. ఇక ఆదివారం చెన్నైతో జరిగిన మ్యాచ్‌లోనూ ముంబై జట్టు ఓటమి చవి చూసింది. అయితే ఆ మ్యాచ్‌లో పాండ్యా బౌలింగ్, కెప్టెన్సీ చాలా పేలవంగా ఉన్నట్లు మాజీ క్రికెటర్ గవాస్కర్(%+ఖుఝుంఝుతీ%) ఆరోపించారు. ముంబై కెప్టెన్సీ చేపట్టిన నాటి నుంచి హార్దిక్‌పై ఆన్‌లైన్‌లో విమర్శలు వెల్తువెత్తుతున్న విషయం తెలిసిందే. పాండ్యా వేసిన ఫైనల్ ఓవర్‌లో 26 రన్స్ వచ్చాయి. దాంట్లో ధోనీ ఒక్కడే 20 రన్స్ స్కోర్ చేశాడు. దీనిపై గవాస్కర్ కామెంట్ చేశాడు. ఇది నిజంగా పసలేని బౌలింగ్, కెప్టెన్సీ అని, రుతురాజ్ గైక్వాడ్, శివం దూబేలు బాగా ఆడినా.. రన్స్‌ను అదుపు చేశారని, చెన్నైని 190 లోపే కట్టడి చేస్తే బాగుండేదని, కానీ చాలా దారుణమైన బౌలింగ్ వేసినట్లు గవాస్కర్ పేర్కొన్నాడు. మొదటి సిక్స్ ఓకే అని, కానీ ఆ తర్వాత లెన్త్ బాల్ వేశాడని, బ్యాటర్ పరుగుల దాహంతో ఉన్నప్పుడు అలాంటి బాల్ ఎలా వేస్తారని అన్నాడు. ఇక మూడవ బాల్ ఫుల్ టాస్ పడిందన్నాడు. మూడు ఓవర్లు వేసిన పాండ్యా రెండు వికెట్లు తీసుకుని 43 రన్స్ ఇచ్చాడు. స్టేడియంలోని అరుపులు, కేకల ప్రభావం పాండ్యాపై ఎక్కువ ఉన్నట్లు అర్థమవుతోందని పీటర్సన్ తెలిపారు. టాస్ వేస్తున్న సమయంలోనూ అతను ఎక్కువగా నవ్వుతున్నాడని, సంతోషంగా ఉన్నట్లు కనిపించేందుకు నటిస్తున్నాడని, అతను సంతోషంగా లేదని, అలాంటి పరిస్థితిని ప్రత్యక్షంగా చూశానని, పాండ్యాను ధోనీ అన్ని దిక్కులా దంచేశాడని, అది నిన్ను బాధకు గురిచేస్తుందని, ఇలాంటి ఘటన వల్ల ఆటపై ప్రభావం పడుతుందని, పాండ్యా ఏదో ఒకటి చేయాల్సి ఉంటుందని పీటర్సన్ తెలిపాడు. పేసర్లను టార్గెట్ చేస్తున్న సమయంలో పాండ్యా ఎందుకు స్పిన్నర్లను వాడలేదని ప్రశ్నించాడు.

# ఆల్ ఫార్మాట్ స్టార్‌గా రోహిత్.. ప్రతి నెలా ఓ సెంచరీ..!

ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో ముంబై ఇండియన్స్ మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ అదరగొడుతున్నాడు. ఈ సీజన్‌లో హిట్‌మ్యాన్ 6 మ్యాచ్‌ల్లో సెంచరీ సాయంతో 261 పరుగులు చేసి నాలుగో లీడింగ్ రన్‌స్కోరర్‌గా కొనసాగుతున్నాడు. సీఎస్‌కేతో నిన్న జరిగిన మ్యాచ్‌లో రోహిత్ మెరుపు సెంచరీతో (63 బంతుల్లో 105 నాటౌట్‌బీ 11 ఫోర్లు, 5 సిక్సర్లు) కదంతొక్కినప్పటికీ ముంబై ఇండియన్స్ ఓటమిపాలైంది. ఈ సీజన్‌లో రోహిత్ చేసిన స్కోర్లు ఇలా ఉన్నాయి. గుజరాత్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో 29 బంతుల్లో 43 పరుగులు చేసిన రోహిత్.. ఆతర్వాత సన్‌రైజర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 12 బంతుల్లో 26 పరుగులు చేశాడు. అనంతరం? రాజస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో డకౌటైన రోహిత్.. ఢిల్లీతో జరిగిన మ్యాచ్‌లో 27 బంతుల్లో 49 పరుగులు చేశాడు. ఆర్సీబీతో మ్యాచ్‌లో 24 బంతుల్లో 38 పరుగులు చేసిన రోహిత్.. తాజాగా సీఎస్‌కేపై సెంచరీతో మెరిశాడు. రోహిత్ ఫామ్ ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌కు మాత్రమే పరిమితం? కాలేదు. హిట్‌మ్యాన్ ఈ ఏడాది ఆరంభం




నుంచే అదరగొడుతున్నాడు. జనవరిలో ఆఫ్ఘనిస్తాన్‌పై టీ20 సెంచరీ చేసిన రోహిత్.. ఆతర్వాత ఇంగ్లండ్‌పై ఫిబ్రవరిలో ఓ సెంచరీ, మార్చిలో ఇంకో సెంచరీ చేశాడు. రోహిత్ ఏప్రిల్‌లోనూ సెంచరీ చేయడంతో ఏడాది ప్రారంభం నుంచి ప్రతి నెల మూడంకెల స్కోర్ తాకిన ఆటగాడిగా రికార్డులోకెక్కాడు. ఈ ఏడాది రోహిత్ టెస్ట్‌ల్లో 45.50 సగటున రెండు సెంచరీల సాయంతో 455 పరుగులు చేయగా.. అంతర్జాతీయ టీ20ల్లో 168.1 స్ట్రయిక్‌రేట్‌తో 60.5 సగటున సెంచరీ సాయంతో 121 పరుగులు చేశాడు. ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో రోహిత్ 167.3 స్ట్రయిక్‌రేట్‌తో 52.2 సగటున 262 పరుగులు సాధించాడు. రోహిత్ ఈ ఏడాది ఇంకా వన్డే మ్యాచ్ ఆడలేదు. రోహిత్ ఈ ఏడాది టెస్ట్‌ల్లో, టీ20ల్లో ఇరగీయడంతో ఆల్ ఫార్మాట్ స్టార్‌గా మారాడు. ఐపీఎల్‌లో రోహిత్ వ్యక్తిగతంగా రాణిస్తున్నప్పటికీ అతని జట్టు ముంబై ఇండియన్స్ మాత్రం వరుస పరాజయాలు ఎదుర్కొంటూ పాయింట్ల పట్టికలో ఎనిమిదో స్థానంలో ఉంది. ఇదిలా ఉంటే, ముంబై ఇండియన్స్‌తో నిన్న జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ 20 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన సీఎస్‌కే.. రుతురాజ్ (40 బంతుల్లో 69బీ 5 ఫోర్లు, 5 సిక్సర్లు), శివమ్ దూబే (38 బంతుల్లో 66 నాటౌట్‌బీ 10 ఫోర్లు, 2 సిక్సర్లు) మెరుపు అర్ధసెంచరీలతో విరుచుకుపడటంతో నిర్ణీత ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 206 పరుగులు చేసింది. ఆఖరి ఓవర్‌లో ధోని సుడిగాలి ఇన్నింగ్స్‌తో (4 బంతుల్లో 20 నాటౌట్‌బీ 3 సిక్సర్లు) శివాలెత్తిపోయాడు.

# ఫెమినిజంపై నోరా షాకింగ్ కామెంట్స్



బాలీవుడ్ భామ నోరా ఫతేహీ ఇటీవల మడ్గావ్ ఎక్స్‌ప్రెస్ సినిమాతో ప్రేక్షకులను అలరించింది. బాలీవుడ్ పలు చిత్రాల్లో స్పెషల్ సాంగ్స్‌లో మెరిసిన ముద్దుగుమ్మ ఇటీవల బాలీవుడ్ జంటలపై సంచలన కామెంట్స్ చేసింది.వారంతా కేవలం డబ్బు, పేరు కోసమే పెళ్లిళ్లు చేసుకుంటున్నారని విమర్శించింది. తనకు అలాంటి ఉద్దేశం లేదని.. అందుకే ఎవరితోను డేటింగ్‌లో చేయడం లేదని చెప్పుకొచ్చింది. తాజాగా ఈ బాలీవుడ్ భామ మరోసారి సంచలన కామెంట్స్ చేసింది. ఓ పాడ్‌కాస్ట్‌లో నోరా మాట్లాడుతూ ఫెమినిజంపై విమర్శలు గుప్పించింది. స్త్రీవాదం అనేది సమాజాన్ని పూర్తిగా నాశనం చేసిందని ఆరోపించింది. అది కేవలం మహిళలనే కాకుండా పురుషులను కూడా బ్రెయిన్‌వాష్ చేసిందంటూ షాకింగ్ కామెంట్స్ చేసింది. ఫెమినిజంపై నోరా మాట్లాడుతూ..'ఇలాంటి ఆలోచన ఎవరికీ అవసరం లేదు. స్త్రీవాదమనే ఈ విషయాన్ని నేను అస్సలు నమ్మను. నిజంగా స్త్రీవాదమే మన సమాజాన్ని పూర్తిగా నాశనం చేసింది. మహిళలు పెళ్లి చేసుకోకూడదు. పిల్లలను కనకూడదనే ధోరణిని తాను విశ్వసించను. ఇది పూర్తిగా స్వతంత్రంగా ఉండాలి. ఇక్కడ పురుషులు డబ్బు, ఫుడ్ కోసం పనిచేస్తుంటే.. ఒక స్త్రీ పిల్లలు, ఇల్లు చూసుకోవడం, వంట చేయడం లాంటివి చేస్తున్నారు. మహిళలు బయటకు వెళ్లి పని చేయాలి.. వారు సొంతంగా జీవించాలని కోరుకుంటున్నారు.. కానీ అది కొంత వరకేనని' చెప్పుకొచ్చింది. ప్రస్తుత సమాజంలో చాలా మంది పురుషుల ధోరణి మారింది. ఇప్పుడు చాలా మంది ఫెమినిజం ద్వారా బ్రెయిన్‌వాష్‌కు గురయ్యారంటూ నోరా తెలిపింది. మనమందరం సెంటిమెంట్స్‌లో సమానమే కానీ.. సామాజికపరంగా సమానం కాదని నోరా పేర్కొంది. స్త్రీవాదం అంతర్లీనంగా, ప్రాథమిక స్థాయిలో గొప్పదే.. నేను కూడా మహిళల హక్కుల కోసం వాదిస్తానని.. బాలికలు పాఠశాలకు వెళ్లాలని కోరుకుంటానని తెలిపింది.

# పెళ్ళికి రెడీ అయిన శ్రీసత్య!



బిగ్ బాస్ షో ద్వారా ఎంతో మంది మంచి గుర్తింపును తెచ్చుకున్నారు. అలాంటి వారిలో శ్రీ సత్య కూడా ఒకరు. ఈ బ్యూటీబిగ్ బాస్ షో తో ఎంత మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.తన కష్టాలను ఆటతీరు అందాన్ని చూసి శ్రీ సత్యకు అందరూ ఫిదా అయిపోయారు. దీంతో ఆమెని టాప్ ఫైవ్ వరకు తీసుకువచ్చారు. అయితే బిగ్ బాస్ లో సందడి చేసిన ఈ ముద్దుగుమ్మ బిగ్బాస్ తర్వాత పలు బుల్లితెర కార్యక్రమాలలో బిజీ అయింది. పలు శోలు డాన్స్ చేస్తూ మరికన్ని షోలో ఎంటర్టైన్ చేస్తూ బిజీగా ఉంది. అయితే గతంలో ఒకసారి శ్రీ సత్య కి ఎంగేజ్మెంట్ అయి బ్రేకప్ అయిన సంగతి మన అందరికీ తెలిసిందే. ఆ తర్వాత వీరిద్దరి మధ్య కొన్ని గొడవలు కొన్ని కలహాలు రావడంతో వీరిద్దరూ విడిపోయారు. ఇక తన జీవితంలో జరిగిన ఇంతటి బాధాకరమైన విషయాన్ని శ్రీ సత్య బిగ్ బాస్ హౌస్ లోకి వచ్చినప్పుడు ప్రతిసారీ ఈ విషయాన్ని చెప్పి బాధపడుతూ ఉండేది. ఈ నేపథ్యంలోనే తన సెకండ్ లవ్ గురించి కూడా బయటపెట్టినట్లుగా తెలుస్తోంది. అయితే ఈ బ్యూటీ బాయ్ ఫ్రెండ్ మరెవరో కాదు పవన్ రవీంద్ర. ఇందులో భాగంగానే ఆమె తన బాయ్ ఫ్రెండ్ కూడా ధరించానని చెప్పడంతో ఈ వార్తలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అంతేకాదు వీరిద్దరూ ఎప్పటినుండో ప్రేమలో ఉన్నారు అని చాలామంది బుల్లితెర సీరియల్ నటులు సైతం చాలా సార్లు తెలియజేస్తూ వచ్చారు. వీరు కలిసి ఉన్న కొన్ని ఫోటోలను కూడా ఎప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతూనే ఉంటాయి. అయితే వీరిద్దరూ ఒక ఈవెంట్లో.. కలుసుకున్నారని.. అప్పటినుంచి ఈ జంట ప్రేమలో ఉన్నారని రివిల్ చేయడం జరిగింది. అయితే శ్రీ సత్య తను లైఫ్ లో ఎన్నో స్ట్రగుల్స్ ని మరియు బాధలని కష్టాలని ఎదుర్కొని ఇప్పుడు పవన్ రవీంద్రత తో ప్రేమలో ఉందని త్వరలోనే పెళ్లి పీటలు కూడా ఎక్కబోతున్నట్లు తెలుస్తుంది. ఈ ఫోటోలు చూసిన వారంతా..' మేము ఇప్పటివరకు నీకు లవ్ ఫెయిల్యూర్ అయిందని అనుకున్నాము. కానీ నువ్వు మళ్ళీ లవ్ లో పడ్డావని మాకు తెలీదు. ఏదేమైనా చూస్తూ చూస్తూనే మమ్మల్ని బురిడీ కొట్టించావుగా. అంటూ కామెంట్స్ చేస్తున్నారుమీ ఎల

# దేవరలో మరో భామ



యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ ప్రస్తుతం దేవర సినిమాతో బిజీగా ఉన్నారు. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ మూవీలో శ్రీదేవి ముద్దుల కూతురు జాన్వీ కపూర్ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమాలో సైఫ్ ?అలీఖాన్ ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. సముద్రం బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నారు. అయితే తాజాగా బాలీవుడ్ భామ ఊర్వశి రౌతేలా చేసిన పోస్ట్ నెట్టింట తెగ వైరవుతోంది. గ్లోబల్ స్టార్ తారక్ ఎంతో వినయంగా ఉంటారని తెలిపింది. మీ ప్రోత్సాహానికి నా కృతజ్ఞతలు.. మీ వ్యక్తిత్వం నిజంగా ప్రశంసనీయమని జూనియర్‌ను కొనియాడింది. త్వరలోనే మీతో కలిసి పనిచేయడానికి ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నానంటూ ట్విటర్‌లో పోస్ట్ చేసింది. ఇది చూసిన ఎన్టీఆర్ అభిమానులు క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. మరోవైపు ఊర్వశి రౌతేలా దేవర చిత్రంలో ప్రత్యేక సాంగ్‌లో కనిపించనుందా? అంటూ కామెంట్స్ చేశారు. గతంలో వాల్తేరు వీరయ్య, ఏజెంట్ చిత్రాల్లో స్పెషల్ సాంగ్స్ చేసిన ఊర్వశి.. దేవరలోనూ నటించనున్నట్లు తెలుస్తోంది. దీనిపై ఇంకా అధికారిక ప్రకటనైతే రావాల్సి ఉది. కాగా.. ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్ బాలీవుడ్ మూవీ వార్-2 షూటింగ్‌లో జాయిన్ అయ్యారు.



# సూపర్ కూల్‌గా విక్రమ్..

## చియాన్ 62 లుక్‌పై క్లారిటీ వచ్చేసినట్టే!

ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో ప్రయోగాత్మక సినిమాలు చేసే అతికొద్ది మంది స్టార్ హీరోల్లో ఒకడు చియాన్ విక్రమ్ సినిమా కోసం ప్రాణమిచ్చే యాక్టర్ల జాబితాలో నంబర్ 1 స్థానంలో ఉంటాడు. సినిమా సినిమాకు మేకోవర్ మార్చుకుంటూ షాకివ్వడం విక్రమ్ స్పెషాలిటీ. ఈ స్టార్ యాక్టర్ ప్రస్తుత బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నాడని తెలిసిందే. విక్రమ్ ఖాతాలో ఇప్పటికే తంగలాన్ ధ్రువ నక్షత్రం సినిమాలున్నాయి. ఈ రెండు సినిమాలు సెట్స్‌పై ఉండగానే చియాన్ 62కు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. చిన్నా ఫేం ఎస్‌యూ అరుణ్‌కుమార్ చియాన్ 62 దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీలో తమిళ నటి దుషారా విజయన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ రిలీజ్ చేసిన లుక్ ఇప్పటికే నెట్టింట వైరల్ అవుతోంది.పా రంజిత్ దర్శకత్వంలో అడ్వెంచరస్ హిస్టారికల్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న తంగలాన్ కోసం విక్రమ్ పూర్తిగా డీగ్లామరైజ్‌డ్ లుక్‌లోకి మారిపోయాడని తెలిసిందే. అయితే చియాన్ 62లో ఎలా కనిపిస్తాడని ఎదురుచూస్తున్న వారి కోసం కొత్త అప్‌డేట్ స్టిల్ రూంలో చక్కర్లు కొడుతోంది. విక్రమ్ శంకర్ పెద్ద కూతురు ఐశ్వర్య శంకర్ వెడ్డింగ్ ఈవెంట్‌లో వైట్ అండ్ వైట్ డ్రెస్‌లో సూపర్ కూల్ లుక్‌లో పాల్గొన్నాడు. చియాన్ 62 ప్రాజెక్ట్ కోసమే ఇలా మారాడని, సినిమాలో విక్రమ్ లుక్ ఇదేనని ఇప్పుడు నెట్టింట తెగ చర్చ నడుస్తోంది. చియాన్ 62లో పాపులర్ యాక్టర్ కమ్ డైరెక్టర్ ఎస్‌జే సూర్య, పాపులర్ మలయాళ నటుడు సూరజ్ వెంజరమూడు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే లాంఛ్ చేసిన తంగలాన్ గ్లింప్స్‌తోపాటు ఫస్ట్ లుక్ పోస్టర్లు సినిమాపై క్యూరియాసిటీ అమాంతం పెంచేస్తున్నాయి. ఈ చిత్రంలో మాళవికా మోహనన్, పార్వతి తిరువొత్తు ఫీ మేల్ లీడ్ రోల్స్ లో నటిస్తుండగా.. పశుపతి, డానియెల్ కల్టగిరోన్ కీ రోల్స్ పోషిస్తున్నారు. విక్రమ్ మరోవైపు గౌతమ్ వాసు దేవ్ మీనన్ డైరెక్షన్‌లో ధ్రువ నక్షత్రం: యుద్ధ కాండం లో నటిస్తున్నాడు. ఈ మూవీలో పెళ్లి చూపులు ఫేం రీతూవర్మ ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది.



# జాన్వీ కపూర్ బ్యాచిలరేట్ పార్టీ .. కానీ ఓ ట్విస్ట్!

బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ ప్రస్తుతం దేవర చిత్రంలో జూనియర్ సరసన కనిపించనుంది. ఈ మూవీ ద్వారానే తెలుగు ఇండస్ట్రీలో అడుగుపెడుతోంది. ఆ తర్వాత గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ సరసన నటించనుంది. అయితే ఇటీవల జాన్వీ కపూర్ పెళ్లిపై నెట్టింట తెగ చర్చ నడుస్తోంది. ఎందుకంటే ఆమె మైదాన్ సినిమాకు చూసేందుకు వెళ్లిన జాన్వీ తన బాయ్‌ఫ్రెండ్ శిఖర్ పహారియా పేరుతో నెక్లెస్ ధరించి కనిపించారు. దీంతో త్వరలోనే పెళ్లి చేసుకోబోతోందంటూ వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. అంతే కాకుండా శిఖర్‌పై జాన్వీ తండ్రి బోనీ కపూర్ సైతం ప్రశంసలు కురిపించారు. ఈ నేపథ్యంలో వీరిద్దరి పెళ్లి చేసుకోవడం ఖాయమని బీ టౌన్‌లో టాక్ నడుస్తోంది. అయితే తాజాగా జాన్వీ కపూర్ బ్యాచిలరేట్ పార్టీని సెలబ్రేట్ చేసుకుంది. దీనికి సంబంధించిన ఫోటోలను తన ఇన్‌స్టాలో షేర్ చేసింది. అదేంటీ అప్పుడే పెళ్లికి సిద్ధమైపోయిందనుకుంటున్నారా? కానీ ఇక్కడే ఓ చిన్న ట్విస్ట్ ఉంది. జాన్వీ కపూర్ తన ఫ్రెండ్ రాధికా మర్చంట్ బ్యాచిలరేట్ పార్టీని నిర్వహించింది. జాన్వీతో పాటు రాధిక ఫ్రెండ్స్ కూడా ఈ విందుకు హాజరయ్యారు. జాన్వీ కపూర్ హోస్ట్ చేసిన ఈ పార్టీలో ఆమె స్నేహితులందరూ గులాబీ రంగు దుస్తులు ధరించారు. ఈ పార్టీకి హాజరైన వారిలో అంజలి మర్చంట్ కూడా ఉన్నారు. కాగా.. ఇటీవలే గుజరాత్‌లోని జామ్‌నగర్‌లోని అనంత్ అంబానీ- రాధిక మర్చంట్ ప్రీ వెడ్డింగ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు బాలీవుడ్ తారలు, వ్యాపారవేత్తలు, క్రీడాకారులు హాజరయ్యారు. పారిశ్రామికవేత్త వీరేన్ మర్చంట్ కుమార్తె రాధిక మర్చంట్ 2022 డిసెంబర్‌లో రాజస్థాన్‌లో జరిగిన వేడుకలో అనంత్ అంబానీతో నిశ్చితార్థం చేసుకున్నారు. వీరి వివాహం ఈ ఏడాది జూలైలో జరగనుంది.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com